J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 40 సంచిక : 51 21.5.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

సినిమాలలో ప్రతినాయకుడు
సమాజంలో ప్రజా నాయకుడు



రీల్ హీరో కాదు..
## రియల్ హీరో

నెల్లూరులో కూడా
సోనూసూద్
సేవా పరిమళాలు

2 లో

స్వపక్షమైనా.. విపక్షమైనా..

# గీత దాటితే వేటు

## స్పష్టమైన సంకేతాలిచ్చిన ఆంధ్రా సీఎం జగన్

- అనూహ్య సంయమనం పాటించిన ముఖ్యమంత్రి
- సీఎంను తక్కువ అంచనా వేసిన రఘురామ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి తన పంథాను బయటపెట్టారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో, అధికారపార్టీపై ఎవరు బురదచల్లే ప్రయత్నం చేసినా సహించేది లేదన్న సంకేతాలను పంపించారు. ప్రభుత్వ పనితీరు పట్ల, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల, ముఖ్యమంత్రి వ్యవహారశైలి పట్ల హద్దుమీరి గీత దాటి దుర్భాషలకు దిగితే... వేటు తప్పదనే స్పష్టమైన సంకేతాలిచ్చారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే పని ఎవరు చెసినా... అది స్వపక్షమైనా, విపక్షమైనా ఒకే న్యాయమని తేల్చిపారేశారు.



నరసాపురం పార్లమెంటు సభ్యుడు రఘు రామరాజు అరెస్టు తేటతెల్లం చేసిన విషయం ఇదే. వందల కోట్ల ఆస్తి, అత్యంత ప్రముఖుడితో వియ్యం, గల్లీ నుండి ఢిల్లీ దాకా పెద్ద పెద్ద వాళ్ళతో పరిచయాలు... అన్నింటినీమించి అధికార పార్టీలో ఎంపి హోదా. ఇవేమీ ఇప్పుడు ఆయనను కాపాడలేకపోయాయి.

2 లో

శ్రద్ధాంజలి



జననం : 1-10-1932 మరణం : 16-5-2021

అజాతశత్రువు, మృదుభాషి, సున్నిత స్వభావం కలిగిన సౌమ్యశీలి
పేద, గొప్ప అన్న తేడా లేకుండా అందరినీ సమానంగా ఆదరించే ఆదర్శమూర్తి

## శ్రీ టంగుటూరు వెంకట కృష్ణారెడ్డి గారు

తేది. 16-5-2021 ఆదివారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్ధిస్తూ...

కుమారులు - కోడలు:
టంగుటూరు వెంకురెడ్డి - సుప్రజ
టంగుటూరు శశిరెడ్డి

కుమార్తె - అల్లుడు :
పులిమి విజయలక్ష్మి
డా॥ పులిమి రమేష్‌రెడ్డి

మనుమలు : డా॥ సందీప్ - నిత్య,
డా॥ రాజీవ్ - శ్వేత
మనుమరాళ్ళు : దివ్య, అదితి

# రియల్ హీరో సోనూసూద్

**కరోనా మొదటిదశ నుంచే దేశవ్యాప్తంగా వేలాదిమంది బాధితులకు నేనున్నానంటూ తనవంతు సేవలందిస్తూ అందరి ప్రశంసలందుకుంటున్న బాలివుడ్ సినీ నటుడు సోనూసూద్ నెల్లూరుజిల్లాలోని కోవిడ్ బాధితుల కోసం కూడా సేవలందించేందుకు నిర్ణయించుకున్నారు. తాను కేవలం సినిమాల్లో రీల్ హీరో కాదు.. నిజజీవితంలో కూడా రియల్ హీరోనేనంటూ నిరూపించు కుంటున్నారు.**

దేశవ్యాప్తంగా కరోనా బాధితులకు బాలివుడ్ నటుడు సోనూసూద్ చేస్తున్న సేవలు గర్వకారణం కాగా, జిల్లాలోని కరోనా బాధితుల పట్ల కూడా ఆయన మానవత్వంతో స్పందించడం విశేషం. జిల్లాలోని కోవిడ్ బాధితుల ప్రాణాలు నిలబెట్టే ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణానికి సాయం చేసేందుకు సోనూసూద్ ముందుకు వచ్చి తన ఔదార్యాన్ని, సేవాభావాన్ని మరోసారి చాటుకున్నారు.. ఈనెల 17న ఆయన జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు ఫోన్ చేసి మరీ ఈ విషయం చెప్పారు. కలెక్టర్ విజ్ఞప్తిని గౌరవించి తప్పకుండా ఈ సాయం అందిస్తామన్నారు. జిల్లాలో దాదాపు ఒకటిన్నర కోట్ల రూపాయల వ్యయంతో ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణానికి సిఎస్ఆర్ ఫండ్ కింద సాయం చేసేందుకు సోనూసూద్ తన అంగీకారం తెలిపారు. ప్రతి రోజూ రెండు టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే సామర్ధ్యం కలిగిన ఆక్సిజన్ ప్లాంట్‌కు సంబంధించి పరికరాలను ఫ్రాన్స్ నుంచి తెప్పించి పంపుతానని ఆయన తెలిపారు. దీంతో ఆ ప్లాంట్‌ను ఆత్మకూరు డివిజన్‌లో ఏర్పాటుచేయనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

ఈ సందర్భంగా సోనూసూద్ అనుచరుడు నెల్లూరుకు చెందిన సమీర్ మాట్లాడుతూ సాటి మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవడం అన్నది సామాజిక బాధ్యతగా భావించి బాధితులకు కాదనకుండా లేదనకుండా సాయం చేయడం సోనూసూద్ నైజమని కొనియాడారు. గతంలో కరోనా, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో వేలాదిమంది వలస కార్మికులకు రవాణా, భోజన వసతి కల్పించడంలో ఆయన చేసిన సేవలు అమోఘమని ప్రశంసించారు. కాగా, జిల్లా ప్రజలు కూడా సోనూసూద్ మానవతా సేవలను అభినందిస్తున్నారు.

### 22 నుంచి పెంచలస్వామికి

# ఏకాంత బ్రహ్మోత్సవాలు



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలం పెంచలకోనలో ఉన్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈనెల 22 నుంచి ఏకాంతంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఇ.ఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. కరోనా నేపథ్యంలో దేవాదాయశాఖ ఆదేశాల మేరకు కోవిడ్ నిబంధనలతో ఉత్సవాలు చేస్తామని, భక్తులకు అనుమతి లేదని చెప్పారు. 22వ తేది సాయంత్రం 5.45 గంటలకు స్వామివారి ఆలంకారమండపంలో అంకురార్పణ, సేనాధిపతి ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని, 23న ఉదయం 7 గంటలకు తిరుచ్చి ఉత్సవం, 10.45 గంటలకు ధ్వజారోహణ, 12 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 గంటలకు దీపాలంకరణ సేవ, 6 గంటలకు శేషవాహన సేవ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా 24న ఉదయం హంసవాహనసేవ, మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, సాయంత్రం దీపాలంకరణ సేవ, అనంతరం బంగారు హనుమంత సేవ, 25న ఉదయం సింహవాహనం, మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, సాయంత్రం దీపాలంకరణ సేవ, అనంతరం నృసింహజయంతిని పురస్కరించుకుని స్వామివార్లకు బంగారు గరుడవాహన సేవలు నిర్వహిస్తామన్నారు. 26న ఉదయం 9.45 గంటలకు శ్రీవారి తిరుకల్యాణం, సాయంత్రం 5 గంటలకు తిరుచ్చి సేవ, 6 గంటలకు గజవాహనం, రాత్రి 8 గంటలకు ఏకాంతసేవ, 27వ తేది ఉదయం 7.30 గంటలకు వసంతోత్సవం, 8.30 గంటలకు చక్రస్నానం, సాయంత్రం 6 గంటలకు అశ్వవాహనసేవ ఉంటాయని, రాత్రి 8 గంటలకు ధ్వజ అవరోహణోత్సవం ఉంటుందని తెలిపారు.

# కరోనా మందుల కిట్లు పంచిన.. ఫ్రెండ్స్ వాకర్స్



నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న కరోనా బాధితులకు కరోనా నివారణకు మందుల కిట్లు అందజేశారు. పలగాటి శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా సుమారు 3 వందల మందికి ఈ మందులను ఉచితంగా అందించారు. వాకర్స్ ప్రతినిధులు ఏకోలు రాఘవరెడ్డి, వేలూరు రంగారావు, వినుకొండ వెంకటేశ్వర్లు, మాగంటి ప్రసాద్, కొండూరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కరోనా మందులు కావాల్సిన వారు వారి ఆధార్‌కార్డుతో 9963324585 లేదా 9989137399 నంబర్లకు సంప్రదించవచ్చని వారు పేర్కొన్నారు.

# గీత దాటితే వేటే

(మొదటి పేజీ తరువాయి)

అలాంటివి ఎన్నున్నా నోరు మంచిదై ఉండాలన్న విషయం ఇప్పుడు ఆయనకు అర్ధమై వుంటుంది. ఆయన చేస్తున్న వికృత చేష్టలను, మాట్లాడుతున్న అసభ్య మాటలను చూస్తూ అసలు ఇన్నాళ్లు ఎందుకు ఉపేక్షించారన్నది కూడా రాజకీయ మేధావులకు సైతం సమాధానం దొరకని ప్రశ్నగా ఉన్నది. జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పెట్టిన తొలినాళ్లలోనే రఘు రామరాజు పార్టీలో చేరారు. చేరిన కొద్దిరోజులకే జగన్మోహన్‌రెడ్డికి ఒక సినిమా టైటిల్ ఇచ్చి, ఆయనపై నోరు పారేసుకుని, బయటకు వెళ్లిపోయారు. అలాంటి వ్యక్తిని మళ్ళీ పార్టీలోకి రానిచ్చి టిక్కెట్టు ఎందుకు ఇచ్చారు...? పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే పార్టీ సిద్ధాంతానికి వ్యతిరేకంగా తెలుగు మీడియంకు మద్దత్తుగా పార్లమెంటులో మాట్లాడితే, ఎందుకు మన్నించారు...?? సామాజిక మాధ్యమాలతో పాటు రెండు ప్రధాన ఛానళ్లను వేదికలుగా చేసుకుని, రోజూ చెవులో జోరీగ లాగా గీ పెడుతుంటే ఎందుకు క్షమించారు...? చివరికి జగన్‌మోహన్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలంటూ కోర్టు మెట్లు ఎక్కేవరకు చూస్తూ ఎందుకు వూరుకున్నారు..? వంటి ప్రశ్నలు రాజకీయ మేధావులను వేధిస్తూ వచ్చాయి. అయితే పురాణాల్లో తన మేనత్త కొడుకైన శిశుపాలుడికి సైతం కృష్ణుడు వంద తప్పులవరకు అవకాశమిచ్చాడు. మనవూరి పాండవులు సినిమాలో కృష్ణంరాజు తన స్వంత అన్న రావుగోపాలరావు తప్పులను లెక్క పెడుతూనే ఉంటాడు, వంద దాటగానే దండిస్తాడు. ఇక్కడ జగన్ కూడా అదే సిద్ధాంతాన్ని అనుసరించారనే చెప్పాలి. తాను ఇచ్చిన టిక్కెట్టుతో పోటీ చేసిన రఘు రామరాజుని ప్రజలు తనను చూసి గెలిపించారు, కాబట్టి జగన్ కూడా బహుశా స్వంత పార్టీ వాడైన రఘురామ తప్పులు లెక్కపెడుతూ వచ్చారేమో....?

## రఘురామ ధీమా ఏమిటి ...?

ఇంతటి నేలబారు స్థాయిలో జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం, ప్రచార మాధ్యమాలను వేదిక చేసుకుని విరుచుకు పడడం వెనుక రఘు రామరాజు ధీమా ఏమిటన్నది ఇక్కడ సామాన్యుడిని సైతం విస్మయపరుస్తున్న ప్రశ్న. తాను ఒక పార్లమెంటు సభ్యుడనని కూడా మరచిపోయి, అత్యంత జుగుప్సాకరమైన భాషను వాడడం, మీసాలు తిప్పుతూ తన వెంట్రుక కుడా పీకలేరని సవాల్ విసరడం, రండ్రా చూసుకుందాం అంటూ రెడ్డి సామాజిక వర్గాన్ని ఛాలెంజ్ చేయడం వంటి రఘు రామ వికృత విన్యాసాలు జనానికి రోత పుట్టించాయి. బహుశా తన వెనుక కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయనో, లేక తన పరపతి ఢిల్లీ వరకు ఉన్నదనో ఆయన భావించి ఇవన్నీ చేసుంటే.. అది ఆయన అపరిపక్వత అనుకోవాలి. లేక అధికారపార్టీపై ఎదురు తిరిగితే తిరుగుబాటు నాయకుడిగా తనకు గుర్తింపు వస్తుందని, తాను కూడా వైయస్ రాజశేఖరరెడ్డి లేదా జగన్మోహన్‌రెడ్డి అంతటి నాయకుడిని కావచ్చని ఆయన అనుకుని ఉండి ఉంటే... అది ఆయన మూర్ఖత్వమే. ఇదే తరహాలో గతంలో లగడపాటి అనే ఒకాయన వైయస్ అధికారంలో ఉన్నప్పుడు, అధికార పార్టీపై తిరుగుబాటు చేసి 'జగడపాటి'గా ప్రసిద్ధి చెందారు. ఆ తరువాత కాలంలో... పెప్పర్ స్ప్రే నాయకుడిగా వార్తలకెక్కారు. చివరాఖరికి జ్యోతిష్కుడి అవతారం ఎత్తి కనుమరుగై పోయారు. ఇప్పుడు ఆయన ఎక్కడ ఉన్నారో కూడా జనానికి తెలియదు.

రఘు రామరాజు కూడా ఇదే స్థాయిలో వార్తలకెక్కాలనుకున్నారు కాబోలు, తన పేరులో ఉన్న త్రిబుల్ ఆర్‌లలో మొదటి ఆర్‌ని 'రచ్చ'గా మార్చుకుని రచ్చ రామరాజుగా ప్రసిద్ధి చెందాలని భావించినట్టు కనబడుతున్నది. 'ఇనఫ్ ఈజ్ ఇనఫ్' అన్నట్టుగా జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి సారించడంతో, రఘు రామకు దిమ్మ తిరిగింది. రోజువారీ 'రచ్చబండ'ను వదిలేసి... కారాగారాలు, ఆసుపత్రులూ, కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తున్నది.

## రాజకీయాలలో ఓనమాలు నేర్చుకుంటున్నవారికి ఇదొక పాఠం..

జగన్మోహన్‌రెడ్డి పుణ్యమా అని చాలామంది కొత్తతరం నాయకులు ఇప్పుడు ఆంధ్రా రాజకీయ ముఖచిత్రంపై మెరుస్తున్నారు. వాళ్లందరికీ రఘు రామరాజు ఉదంతం ఒక పాఠం లాంటిది. తమ పరిధి, స్థాయి తెలుసుకోకుండా హద్దు మీరి, గీత దాటితే వేటు తప్పదని అర్ధమైపోయింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే అరెస్టులు చేస్తున్నారని, శుక్రవారం వస్తుందంటే భయపడాల్సి వస్తుందని ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు గగ్గోలు పెడుతున్నారు. మరి రఘు రామరాజు తరహాలో అంతే స్థాయిలో ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాలని విమర్శిస్తూ, పదే పదే ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్న ఆయనను, ఆయన కుమారుడిని కూడా ఎందుకు అరెస్టు చేయలేదన్న అనుమానం చాలామందికి రావచ్చు. దేనికైనా సమయం రావాలి కదా! ప్రక్షాళన తమ స్వంత పార్టీ నుండే మొదలుపెట్టారు సి.యం.

ఎవరినీ వదిలిపెట్టే పనే లేదు. కాకుంటే కాస్త ముందూ... వెనుకా అంతే...!

## రఘు రామరాజు కొత్త డ్రామా

తనను ఓ ఐదుగురు ముసుగువీరులు లాకప్‌లో వీరబాదుడు బాదారని, ప్రస్తుతం తాను నడిచే పరిస్థితుల్లో కూడా లేనని రఘు రామకృష్ణరాజు కోర్టు ముందు వాపోయారు. అయితే, నిజానిజాలు నిగ్గు తేల్చాలని కింది కోర్టు రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రి వర్గాలను ఆదేశించడం, అసలు అలాంటిదేమీ లేదని ఆసుపత్రి వర్గాలు రిపోర్టు ఇవ్వడంతో అంతా అయిపోయిందనుకున్నారు. అయితే సుప్రీం కోర్టును ఆశ్రయించిన రఘురామ న్యాయవాదులు, రఘు రామకు సికింద్రాబాద్‌లోని మిలటరీ ఆసుపత్రి చేత పరీక్షలు చేయించాలని ఉత్తర్వులు తెచ్చారు. ఇప్పుడు సీన్ సికింద్రాబాద్‌కు మారింది. సోమవారం సాయంత్రం రఘురామను సికింద్రాబాద్ మిలటరీ ఆసుపత్రికి తరలించారు. తదుపరి ఆదేశాలిచ్చే వరకు రఘు రామరాజు అక్కడే ఉంటారు. ప్రస్తుతం బాల్ మిలటరీ ఆసుపత్రి వారి కోర్టులో ఉంది. భారతదేశం ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత స్థాయి పదవుల్లో ఎంపి ఒకటి. ఆ స్థాయిని రఘు రామరాజు మరచిపోయి ప్రవర్తించినా... కోర్టు గుర్తుపెట్టుకుంది. ఆరోపిస్తున్నది పార్లమెంటు సభ్యుడు కాబట్టి పకడ్బందీగా దర్యాప్తు జరగాలని ఆదేశించి రఘు రామరాజు సచ్ఛీలతను పరీక్షించుకోవడానికి మరో అవకాశం కల్పించింది. చూద్దాం... ఏం జరుగుతుందో?

### ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రిలో

# ఆర్డీఓ ఆకస్మిక తనిఖీలు

ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని ఆర్డీఓ ఏ.చైత్రవర్షిణి ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోవిడ్ రోగుల వివరాలు, అందిస్తున్న వైద్యసేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోవిడ్ వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవల తీరుపై ఆరాతీశారు. ఆక్సిజన్ అందిస్తున్న విధానం, ఆక్సిజన్ నిల్వల పరిస్థితిని ఆస్పత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. విలేకరులతో మాట్లాడుతూ కోవిడ్ రోగులకు అందిస్తున్న వైద్యసేవల తీరును ఎప్పటికప్పుడు మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి దృష్టికి తెస్తున్నామన్నారు.

## యుద్ధం

ఇపుడు –
యుద్ధం అనివార్యం
నీ కుడిభుజం విరచి వీధుల్లోకి
విసరేసిన భయానక విషణ్ణంలో
నడినెత్తిన సూర్యుడు
నీ ఆనవాళ్ళే ప్రశ్నార్ధకం చేసినప్పుడు
అల్లకల్లోల సంద్రమైన బ్రతుకు
బలిపీఠంపై ప్రశ్నార్ధకమైనపుడు
సాఫీగా, ప్రశాంతంగా
ఎలా ఉండగలం?
అసహాయ మానవలోకానికి
స్వప్నాలు బ్రద్ధలైన రాత్రి
గాయాలు సలపరమై కెలుకుతుంటే
జీవంలేని సంభాషణల మధ్య
మృత్యుఘోషను ఎలా భరించగలం
ఇక్కడ –
చావడానికీ, చావకపోవడానికీ
మధ్యతేడా కన్పించడం లేదు
నీరవ నిశ్శబ్దం రక్తారుణ రేఖలు గీస్తుంది
యుద్ధం చేయకపోతే మరణించడానికి
ఘడియలు లెక్కపెట్టుకోవచ్చు
టీవీల్లో దర్జాగా దృశ్యాదృశ్యాలై
భరోసా ప్రకటనలు మార్మోగుతుంటే
వాస్తవంలో దు:ఖపు తెగులు ప్రాకుతోంది
వేదికలు స్కీముల మంత్రాలు వల్లెవేస్తుంటే
వనాలన్నీ నిమ్మళంగా నిద్రిస్తున్నాయి
ఇక్కడ హృదయ కంపనలు ఆగుతున్నాయి
ఇక యుద్ధమేఘాలు ఆవహించాలి
మనిషి యుద్ధమైన సమరనాదం ధ్వనించాలి
ఆస్పత్రులన్నీ సమాధులవుతున్న హేలలో
మనిషి యుద్ధోన్ముఖుడు గాక
తప్పేదేముంది
ఇప్పటి యుద్ధం దేశాలతో కాదు
ద్రోహచింతన నిండిన దిక్కులతో!



– చిన్ని నారాయణరావు
94402 02942



## మన సతీష్‌రెడ్డి.. మరో ఘనత!

# '2-డీజీ' తొలి విడత మందు వచ్చేసింది


- **రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా ఆవిష్కరణ**

కరోనా మహమ్మారిని కట్టడి చేసే ధ్యేయంతో భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) తయారుచేసిన 2 డియాక్సీ డీ గ్లూకోజ్ (2 డీజీ) మందును ఢిల్లీలో దేశ రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా ఈనెల 17న ఆవిష్కరించడం ఎంతో గర్వకారణం. పొడి రూపంలో ఉండే ఈ ఔషధాన్ని కేంద్ర ఆరోగ్యమంత్రి హర్షవర్ధన్‌కు రక్షణ మంత్రి అందజేశారు. ఈ పొడి ప్యాకెట్ల రూపంలో ఉన్న బాక్సులను ఎయిమ్స్ డైరెక్టర్ రణదీప్ గులేరియాకు, సాయుధ బలగాల వైద్యసేవల లెఫ్టినెంట్ జనరల్ సునీల్‌కాంత్‌కు కూడా ఇచ్చారు. కోవిడ్ రోగుల చికిత్సలో అత్యవసర వినియోగం కోసం దేశంలోని వివిధ ఆసుపత్రులకు కూడా మరిన్ని బాక్సులతో కూడిన ఈ మందును త్వరలోనే పంపిణీ చేయనుండడం విశేషం. ఈ సందర్భంగా ఈ దివ్యౌషధాన్ని కనిపెట్టి తయారుచేసిన డిఆర్‌డిఓ సంస్థను, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ సంస్థను రక్షణమంత్రి అభినందించారు. కోవిడ్ సంక్షోభంతో దేశం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న ఈ సమయంలో 2 డీజీ ఔషధం ఓ కొత్త ఆశాకిరణం అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ఈ మందు వినియోగంతో కోవిడ్ బాధితులు ఆక్సిజన్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి తప్పుతుందని, బాధితులు త్వరగా కోలుకుంటారని కేంద్రమంత్రి డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. డిఆర్‌డిఓ ఛైర్మెన్ డాక్టర్ సతీష్ రెడ్డితో పాటు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాజేష్‌భూషణ్, ఆరోగ్యసేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొనగా, సిసిఎంబి డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ మిశ్రా, దేశవ్యాప్తంగా ఉన్న అనేకమంది వైద్యులు, ఆసుపత్రులవారు, ల్యాబొరేటరీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో వర్చువల్ పద్ధతిలో పాల్గొన్నారు.

### జూన్ మొదటివారానికల్లా అన్ని ఆసుపత్రులకు

**- డాక్టర్ సతీష్‌రెడ్డి**

కోవిడ్ వైరస్ నుంచి బాధితులు త్వరగా కోలుకునేందుకు ఈ ఔషధం ఎంతగానో ఉపయోగపడుతుందని డిఆర్‌డిఓ ఛైర్మెన్, మన నెల్లూరీయుడు డా.సతీష్‌రెడ్డి ఈ సందర్భంగా ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. 2 డీజీ మందు ఉత్పత్తి సామర్థ్యాన్ని తమ సంస్థ పెంచుతుందని, జూన్ తొలి వారానికల్లా అన్ని ఆసుపత్రుల్లో ఈ మందు అందుబాటులోకి వచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. డిఆర్‌డిఓ ప్రయోగాల విషయంలో తమకు అన్ని విధాలా సహకరిస్తూ మార్గదర్శనం చేస్తున్న రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సతీష్‌రెడ్డి తన కృతజ్ఞతలు తెలిపారు.




2-డీజీ తొలి విడుత మందును ఆవిష్కరిస్తున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్

## జయభారత్ ఆసుపత్రికి

# 47 లక్షల విరాళం

**ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణానికి నిధులిచ్చిన దాతలు**



నెల్లూరు నగరంలో సింహపురి వైద్యసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జయభారత్ ఆసుపత్రిలో కోవిడ్ బాధితులకు చేస్తున్న సేవలను గుర్తించిన పలువురు దాతలు ఆ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణానికి భూరి విరాళాలిచ్చి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. డిపి గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్-నెల్లూరు వారు సిఎస్‌ఆర్ నిధుల కింద 23 లక్షల రూపాయలు, చెన్నైకి చెందిన మద్రాస్ చిన్మయ సేవా ట్రస్ట్ వారు మరో 24 లక్షల రూపాయలు అందజేశారు. డిపి గోల్డ్ ప్రై.లి., డైరెక్టర్ దిలీప్‌కుమార్ వారి కుటుంబ సభ్యులు ఆ విరాళం చెక్కును సింహపురి వైద్య సేవాసమితి ట్రస్ట్ సభ్యులు గుర్రం సుధాకర్‌కి జైన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జెపి జైన్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ నెల్లూరు కోవిడ్ బాధితులకు ఉపయోగపడేందుకు ఈ విరాళం అందజేశామన్నారు. రాబోయే రోజుల్లో కూడా జయభారత్ ఆసుపత్రికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ మాట్లాడుతూ కరోనా బాధితులకు ఆక్సిజన్ అందజేసేందుకు ముందుకు వచ్చిన దాతలకు అభినందనలు తెలియజేస్తూ.. త్వరలోనే ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జైన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి సిపి జైన్, డిపి గోల్డ్ సంస్థ డైరెక్టర్ అంకిత్ తదితరులు పాల్గొన్నారు. కరోనా బాధితుల ప్రాణాలను నిలబెట్టేందుకు దాతలు ఇలా ముందుకు రావడం, అవసరమైన ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటుకు విరాళం ఇవ్వడం పట్ల జిల్లా ప్రజలు దాతల ఔదార్యాన్ని కొనియాడుతున్నారు.


## ప్రథమ వర్ధంతి



మా పెద్దదిక్కు, మా ఇంటి వెలుగు

**శ్రీమతి కోర్శపాటి సీతమ్మ గారు**

(స్వర్గీయ కోర్శపాటి గోపాలరెడ్డి గారి సతీమణి)

పరమపదించి తే. 20.05.2021 నాటికి ఏడాది గడిచిన సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

కుమారుడు:
కోర్శపాటి శ్రీధర్‌రెడ్డి, USA

కోడలు:
కోర్శపాటి శైలజ

కుమార్తెలు - అల్లుళ్ళు
మోసూరు హైమావతి - మోసూరు షణ్ముగంరెడ్డి
ఇసనాక శ్యామల - ఇసనాక జనార్ధన్‌రెడ్డి, USA
చేవూరు జ్ఞానప్రసూన - చేవూరు కృష్ణారెడ్డి

మరియు మనుమలు, మనుమరాళ్ళు, ముదిమనుమడు, ముదిమనుమరాలు

## 'ప్రభా'తం

# ముందుచూపు లేకుంటే ముప్పే!

ఒకవైపు కరోనా, లాక్‌డౌన్‌లు..మరోవైపు ప్రభుత్వాల అస్తవ్యస్త విధానాలతో దేశంలో నిరుద్యోగం బాగా ప్రబలిపోతోంది. గత మార్చి నెలలో 6.4 శాతంగా ఉన్న నిరుద్యోగం మే మొదటి వారానికి 12 శాతం దాకా పెరిగిపోయినట్లు తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. నిరుద్యోగం అంతకంతకూ పెరిగిపోతూ పేదలు, సామాన్యుల బతుకులు కష్టాల కడగండ్లలో పడ్డాయి. ముందు-చూపు లేకపోవడమే ఇలాంటి దుస్థితికి మూలకారణం. ఇకనైనా ఈ పరిస్థితులపై కేంద్రం దృష్టి సారించాలి. కరోనాని కట్టడిచేసి, నిరుద్యోగాన్ని నియంత్రించి, ఆర్థికవ్యవస్థను మళ్లీ గాటన పెట్టేందుకు పటిష్టమైన పథకాల అమలుతో.. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కోగలిగే ముందు-చూపుతో ముందుకు సాగాలి.

దేశం ఇప్పుడు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. అటు కరోనా, ఇటు నిరుద్యోగం రెండూ రోజురోజుకీ భయంకరంగా పెరిగిపోతూ దేశం గతంలో ఎన్నడూ లేనంత విపత్కరస్థితిలో ఉంది. కోవిడ్ కేసులు రోజూ లక్షల్లో ఉంటే, నిరుద్యోగుల సంఖ్య కోట్లల్లోకి పోతోంది. కరోనా ఒకటి, రెండు దశలతో పాటు మరింత త్వరలోనే మూడోదశ కూడా ఉంటుందని, ఈసారి చిన్నారులకు కూడా మూడోదశలో ముప్పు ఉంటుందనే ఊహాగానాలతో మరోవైపు దేశం అట్టుడికిపోతోంది. రెండోదశ కరోనాలో ముందుచూపు లేకుండా నిర్లక్ష్యం వహించడం వల్లే కోవిడ్ తీవ్రత ఎక్కువైందని, మూడోదశ కూడా రాకముందే తక్షణ ముందస్తు చర్యలు తీసుకుంటే తప్ప ఆ ముప్పును ఎదుర్కోలేమని నిపుణులు పదేపదే హెచ్చరిస్తున్నా ఆ దిశగా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికే రెండోదశ కోవిడ్‌ను నివారించే దశలోనే ఉన్న ప్రభుత్వాలు మూడోదశ నివారణ వైపు చూసే పరిస్థితి కనిపించడం లేదు. దేశంలో ఇప్పుడు గత ఒకటిరెండు రోజులుగా కరోనా కేసులు తగ్గుతున్నట్లనిపిస్తున్నా, మరణాల సంఖ్య మాత్రం ఇంకా బెంబేలెత్తిస్తూనే ఉంది. ఒకవైపు కరోనా మరణ మృదంగం మోగిస్తుంటే, మరోవైపు నిరుద్యోగం తాండవనృత్యం చేస్తోంది. గత మార్చి నెలలో 6.4 శాతంగా ఉన్న నిరుద్యోగం ఏప్రిల్ వచ్చేసరికి 8 శాతం దాటి, మే మొదటి వారానికి 12 శాతం దాకా పెరిగిపోయినట్లు తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 7.13 శాతానికి, పట్టణాల్లో 9.78 శాతానికి నిరుద్యోగం పెరిగిందని భారత ఆర్థిక పర్యవేక్షక కేంద్రం గణాంకాలే వెల్లడిస్తున్నాయి. నిరుద్యోగం అలా అంతకంతకూ పెరిగిపోతూ పేదలు, సామాన్యుల బతుకులు కష్టాల కడగండ్లలో ఉన్నా దేశంలో జాతీయ పట్టణ ఉపాధి హామీ పథకం ఏళ్ళతరబడిగా పట్టాలకెక్కిందే లేదు. అంతే కాదు, గ్రామీణ జాతీయ ఉపాధి పథకం ఉన్నా కూడా ఆశించిన స్థాయిలో దానికి నిధులందడం లేదు. ముందుచూపు లేకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణం. తీరా చేతుల కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఏముంటుందీ?..దేశంలో నిరుద్యోగాన్ని నియంత్రించకపోతే ఇదికూడా మరో కోవిడ్ భూతంలా తయారవుతుందని ఎంతోకాలం నుంచి మేధావులు హెచ్చరిస్తున్నా దాన్ని నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలు నామమాత్రమే. పేదల ఆకలి తీర్చడానికి ప్రభుత్వాలు నిత్యావసరాలు అందజేస్తున్నా అవి అందరికీ సరిపోవడం లేదు. దీంతో కోట్లాదిమంది పేదసాదా ప్రజలు నేటికీ దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ మానవ వనరులను సద్వినియోగం చేసుకుని ఉపాధి కల్పన కొరత లేకుండా ఉన్నప్పుడే దేశంలో ఆర్థికపరిస్థితులు మెరుగుపడతాయని నిపుణులు సూచిస్తున్నా ఇంతకాలంగా ఎవరు పట్టించుకున్నారనీ?..కోవిడ్ వైరస్ తీవ్రత ప్రభావాన్ని అరికట్టేందుకు లాక్‌డౌన్‌లు తప్పనిసరి. అయితే లాక్‌డౌన్‌ల ప్రభావంతో నిరుద్యోగం కూడా పెరగడం తప్పనిసరిగానే మారుతోంది.

కనుక ఈ రెండు మహమ్మారుల్ని ఏమాత్రం విస్మరించడానికి లేదు. ఈ రెండింటినీ నియంత్రిస్తూ ముందుకు సాగాలి. లాక్‌డౌన్‌ల ప్రభావంతో గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఎక్కడ చూసినా వీధులన్నీ వెలవెలబోతున్నాయి. దుకాణాలు, హోటళ్ళు, ఇతరత్రా వ్యాపార సంస్థలన్నీ మూతపడుతుండడంతో పరిస్థితి దయనీయంగా మారుతోంది. పరిశ్రమలు, ఇతర రంగాల్లో పనిచేసే కోట్లాదిమందికి లాక్‌డౌన్‌లతో పనులు లేకపోవడంతో వారి జీవన పరిస్థితులు అల్లకల్లోలంగా మారాయి. ఆర్థిక సమస్యలు చుట్టుముడుతుండడంతో చిన్నతరహా పరిశ్రమలతో పాటు పెద్దపెద్ద ఫ్యాక్టరీలు కూడా మూతపడుతున్నాయి. పనులు లేక, కుటుంబాలను పోషించుకోలేక బడుగు బలహీనవర్గాలవారు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఇక రోజువారి పనులు చేసుకునే కష్టజీవులు, తాత్కాలిక ఉద్యోగులు, చిన్నచిన్న వ్యాపారులు, చేతివృత్తుల వారి సంగతి సరేసరి. నగరాలు, పట్టణాల్లో ఇక బతకలేమని వలస కార్మికులంతా తిరిగి స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. పల్లెపట్టుల్లో కూడా ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి. డీలా పడిఉన్న ఉపాధి హామీ పథకాలకి కాయకల్ప చికిత్స చికిత్స చేసే నాధులు లేరు. దేశంలో ఉద్యోగాల కల్పన అనేది కేవలం ప్రచారార్భాటంగానే మారిందే తప్ప ఆచరణలోకి రానేలేదు. కొత్త వాటి సంగతి తర్వాత. ఉన్నవాటికే దిక్కులేని పరిస్థితి. ఈ దుర్భర పరిస్థితుల నుంచి ఎలా గట్టెక్కాలో ప్రభుత్వాలు తక్షణం ఆలోచించాలి.

ఆర్థికవ్యవస్థ బాగుపడాలంటే కేంద్రం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవాలని, కనీసం అయిదున్నర లక్షల కోట్ల భారీ ఉద్దీపన ప్యాకేజీ తక్షణం అవసరమని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీ ఇటీవలే ఒక తాజా నివేదికలో స్పష్టం చేసింది. పేదలకు ఉచితంగా ఇచ్చే రేషన్‌ను ఈ ఏడాది చివరి దాకా కొనసాగించాలని, జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి కేటాయించిన బడ్జెట్‌ను 1.75 లక్షల కోట్లకు పెంచి పనిదినాలను కూడా పెంచాలని, పట్టణ పేదలను దృష్టిలో పెట్టుకుని 'అర్బన్ ఎంప్లాయ్‌మెంట్ ప్రోగ్రాం'ను వెంటనే ప్రారంభించాలని, ప్రస్తుత పరిస్థితుల్లో తీవ్రంగా నష్టపోతున్న కుటుంబాలను గుర్తించి వారిని ఆదుకునేందుకు కనీసం మూడునెలల పాటు 5 వేల రూపాయల వంతున ఆర్థికసాయం అందించాలని సూచించింది. ఒకవేళ ఇలాంటి అంశాలను పట్టించుకోకపోతే స్వల్పకాలిక నష్టాలను కొనసాగించడంతో పాటు గత కొన్నేళ్ళుగా సంక్షేమ పథకాల ద్వారా సాధించిన ప్రగతిని కోల్పోవాల్సి ఉంటుందని కూడా హెచ్చరించింది. ఇలాంటి ఆలోచనాత్మక సూచనల్ని ఇకనైనా కేంద్రప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ముందుచూపుతో ముందుకు కదలాలి. పొంచివున్న ముప్పును సైతం ముందుగానే గుర్తించి దాన్ని నివారించాలి. మరింత పటిష్టమైన ఆలోచనలతో దేశంలో కరోనా ముప్పునే కాదు, ఎలాంటి ముప్పులనైనా సరే ఎదుర్కొని..అన్ని రంగాలను..అన్ని వ్యవస్థలను తిరిగి నిలబెట్టాలి. అదే ఇప్పుడు ప్రభుత్వ తక్షణ కర్తవ్యం.

# నెల్లూరు పండితునికి.. అపూర్వ అవకాశం

## అన్నమయ్య కీర్తనలకు అర్థతాత్పర్యాలను రచించాలని కోరిన టిటిడి


సూరం శ్రీనివాసులు

నెల్లూరు నగరానికి చెందిన ప్రముఖ శతావధాని సూరం శ్రీనివాసులుకు తిరుమల తిరుపతి దేవస్థానాల వారి నుంచి ఓ అపూర్వ అవకాశం లభించింది. అన్నమాచార్యుల వారి సంకీర్తనలకు తాత్పర్యాలను, ఆ కీర్తనల్లోని కఠిన పదాలకు అర్థాలను, రచించే బాధ్యతను ఆయనకు అప్పగించడం ఎంతైనా విశేషం. అన్నమయ్య రచించిన సంకీర్తనలను గతంలోనే టిటిడి అనేక సంపుటాలుగా ప్రచురించింది. వీటిలోని 11,12,13 సంపుటాల్లో ఉన్న 933 కీర్తనలకు భావాలను రచించి, కఠిన పదాలకు అర్థాలను పదపట్టిక ద్వారా రూపొందించి అందరికీ సులభగ్రాహ్యమయ్యే విధంగా తెలియజేయడం ఇందులోని ప్రధాన ఉద్దేశ్యం. వీటిని కూడా ఆ తర్వాత టిటిడి ముద్రించి వెలుగులోకి తెస్తుందని, ఈ కార్యభారాన్ని నిర్వహిస్తున్నందుకు గాను శ్రీనివాసులుకు ప్రతి సంకీర్తనకు నూరు రూపాయల వంతున శ్రీవారి ప్రసాదంగా సుమారు లక్ష రూపాయల పారితోషికాన్ని కూడా అందిస్తామని టిటిడి తెలియజేసింది. ఆ మేరకు శ్రీనివాసులుకు టిటిడి రాసిన లేఖలో ఈ ప్రత్యేక అంశంపై తమ లక్ష్యాలను వివరించింది. శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల వారు శ్రీ వేంకటేశ్వర స్వామిపై రచించిన సంకీర్తనలు శృంగార, ఆధ్యాత్మ, యోగమార్గాలలో మహోపదేశాన్ని ఇస్తున్నాయని, తిరుమలేశుని వివిధ దేవతా స్వరూపాలతో అభిన్నంగా భావించి కీర్తించిన కారణజన్ముడు అన్నమయ్య అని టిటిడి ఈ సందర్భంగా స్పష్టం చేస్తూ, అన్నమయ్య సంస్కృతం, తెలుగు భాషల్లో ఎన్నో కీర్తనలు రచించినప్పటికీ, లభిస్తున్న కీర్తనలు అధికంగా తెలుగులోనే ఉన్నాయని, అవి విశేషించి దేశి కవితా ధోరణికి అద్దం పడుతున్నాయని టిటిడి పేర్కొంది. అన్నమయ్య సంకీర్తనలు, వారి వంశీయుల సంకీర్తనలను టిటిడి 29 సంపుటాలుగా ముద్రించిందని, వాటికి ప్రతిపదార్థంతో పాటు కఠిన పదాలకు అర్థాలు తాత్పర్యం, విశేషాంశాలతో వివరించాలని టిటిడి ఈ సందర్భంగా సూరం శ్రీనివాసులును కోరింది. కాగా ఇప్పటికే శతావధాని శ్రీనివాసులు లక్షకు పైగా ఉన్న వ్యాసభారతంలోని శ్లోకాలకు భావాలు రచించగా, వాటిని గోరఖ్‌పూర్‌లోని సుప్రసిద్ధమైన గీతాప్రెస్ వారు గ్రంథాలుగా ముద్రించి ఉన్నారు. ఆదిశంకరాచార్య విరచితమైన శివానందలహరికి సంస్కృత భాషలో వ్యాకరణపరంగా వ్యాఖ్యానాన్ని కూడా ఆయన రచించారు. అద్వితీయమైన రీతిలో ఆయన 'సౌమనస్యం' అనే పద్యకావ్యాన్ని కూడా రచించి ప్రముఖ పండితులు, సారస్వతవేత్తల ప్రశంసలందుకున్నారు. ఇటీవలే ఆయనకు టిటిడి పురాణ పరిష్కరణ పరిషత్తు సభ్యత్వం కూడా లభించింది. సుమారు మూడుదశాబ్దాల పాటు ఓరియంటల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైరైనప్పటికీ శ్రీనివాసులు ఆధ్యాత్మిక గ్రంథాల రచనలో నిమగ్నమై అవిశ్రాంతంగా కృషిచేస్తుండడం ఎంతైనా విశేషం!

## వెలుగు ఏపీఎం..
# శివయ్య కన్నుమూత

ఆత్మకూరు నియోజకవర్గంలోని చేజర్ల మండలంలో పని చేస్తున్న వైఎస్సార్ వెలుగు ఏపీఎం ఏ.శివయ్య(45) కరోనాతో చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందారు. అయిదు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన శివయ్య నెల్లూరులోని ఆస్పత్రిలో చేరి కరోనాకు చికిత్స పొందుతూ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. విధి నిర్వహణలో ఆయన ఎంతో క్రమశిక్షణతో, నిబద్ధతతో పనిచేసేవారని, అలాంటి ఏపిఎం మృతి జీర్ణించుకోలేకపోతున్నామని ఆయన సహచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్వామా అధికారులు, ఉద్యోగులు ఆయన మృతికి చింతిస్తూ ఆయన కుటుంబానికి సంతాపం తెలియజేశారు.

## సంగమేశ్వరాలయం ఇఓ..
# వెంకటేశ్వర్లు శివైక్యం

సంగంలోని శ్రీ కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయం కార్యనిర్వహణాధికారి ఆవుల వెంకటేశ్వర్లు (50) కరోనాతో బాధపడుతూ చెన్నై వైద్యశాలలో ఇటీవల మృతిచెందారు. నెల్లూరుకు చెందిన వెంకటేశ్వర్లు, పదిరోజుల క్రితం కరోనా పరీక్షలు చేయించుకోగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దాంతో చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స కోసం చేరారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 15న మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతికి గ్రామస్తులు సంతాపం తెలిపారు.

# కరోనాతో ఉన్నా, రోడ్లమీద తిరగడమేందన్నా?




కరోనా సోకిన వాళ్ళు చాలామంది ఇళ్ళ వద్దనే చికిత్సలు చేయించుకుంటూ భద్రంగా ఉన్నారు. మరికొంతమంది ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారు. అయితే, కొంతమందికి స్వల్ప లక్షణాలు ఉంటే, వాళ్ళు పరీక్షలు చేయించుకోకుండా వీధుల్లో ఇష్టం వచ్చినట్లు తిరిగేస్తే ఎలా? చాలాచోట్ల కరోనా సోకిన కుటుంబాలలోని వారు వారి పనుల నిమిత్తం లేదా సరుకులు, మందులు వగైరాల కోసం రోడ్ల మీదకు వచ్చేస్తున్నారని ఎక్కడపట్టినా వదంతిగా ఉంది. ఒకవేళ అలాంటివారెవరైనా ఉంటే.. దయచేసి రోడ్ల మీదకు రాకుండా, ఇంట్లోనే తగు వైద్యం చేయించుకోవడమో, లేదా వైద్యుల సలహా ప్రకారం ఆసుపత్రులలో చేరడం మంచిది. ఇప్పుడు కరోనా వైరస్ రెండోదశ తీవ్రంగా ఉన్న పరిస్థితుల్లో ఎవరికి ఈ వ్యాధి ఉందో అంతుబట్టని పరిస్థితి. వ్యాధి సోకినవాళ్ళయినా, తమకు ఈ వ్యాధి సోకిందని గుర్తించారో లేదో కూడా తెలియడం లేదు. వ్యాధి లక్షణాలను పదేపదే అధికారులు చెప్తూనే ఉన్నారు. వాటి ద్వారా వ్యాధిని గుర్తించి వెంటనే తగు చికిత్సలు చేయించుకోవడం ఎంతైనా శ్రేయస్కరం. ఆ వ్యాధి వాళ్ళకు సోకిందో లేదో ఎవరికి తెలుస్తుంది? ఈ విషయంలో ఎవరినీ తప్పు పట్టలేం! ఎవరికివారు తమ జాగ్రత్తలు తాము తీసుకుంటూ ఈ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలి. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. సామాజిక దూరం పాటించాలి. తరచూ చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. వీలైనప్పుడల్లా శానిటైజర్‌లు వాడుకోవాలి. మనవల్ల మరొకరికి గాని, మన కుటుంబసభ్యులకు గాని ఎవరికైనాసరే ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవడం కూడా ముఖ్యం. అందువల్ల అందరూ జాగ్రత్తలు పాటించి కరోనాను నివారించాలని కోరుకుందాం!

– ఎస్.సుబ్బరాయుడు, కొత్తూరు.

# సతీష్‌రెడ్డి గారికి అభినందనలు

దేశంలో కరోనా వ్యాధి విజృంభిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో డిఆర్‌డిఓ ఛైర్మెన్, మన నెల్లూరుజిల్లా వాసి, శాస్త్రవేత్త సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో డిఆర్‌డిఓ వారు కరోనాకు విరుగుడు మందు కనిపెట్టడం ఎంతైనా అభినందనీయం. జిల్లాకే కాదు దేశానికే మన సతీష్‌రెడ్డి గర్వకారణం. కరోనా బాధితుల కోసం వారు తయారు చేసిన '2-డీజీ' మందు త్వరగా దేశంలో అందరికీ అందుబాటులోకి రావాలని, తద్వారా కరోనా త్వరగా అదుపులోకి రావాలని ఆశిద్దాం!

– కె.వెంకటేశ్వర్లు, సంగం.

- సిఎం జగన్ ఆదర్శం

# కోవిడ్‌తో అనాధలైన పిల్లలకు బాసట

## 10 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్‌కు నిర్ణయం



**రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దేశంలోనే మరో చరిత్రాత్మకమైన, మానవీయమైన నిర్ణయం తీసుకుని దేశప్రజల అభినందనలు అందుకుంటున్నారు. ఈ కరోనా కష్టకాలంలోనూ ఏమాత్రం వెనుకంజవేయకుండా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.**

కరోనా మహమ్మారి కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల ఆలనాపాలనా చూడాల్సింది ప్రభుత్వమేనంటూ, ఆ చిన్నారుల భవిష్యత్తును, వారి బాగోగులను చూసేందుకు కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఈనెల 17న అధికారులను ఆదేశించారు. కరోనా వల్ల అనాధగా మిగిలిన చిన్నారుల పేరుమీద 10 లక్షల రూపాయల వంతున బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ వేసి, దానిపై వచ్చే వడ్డీని నెలనెలా వారికి అందేలా చూడాలని సిఎం జగన్ అధికారులను ఆదేశించడంతో ఆ అనాధ చిన్నారుల భవితకు చేయూతనిచ్చినట్లయింది. ఆ చిన్నారులకు అలా 25 ఏళ్ళు వచ్చేవరకు ఆ మొత్తాన్ని అందజేస్తారని, ఆ తర్వాత ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను వారి అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే అవకాశం కూడా కల్పించాలని సిఎం సూచించారు కూడా. దీంతో అనాధలైన చిన్నారుల కుటుంబసభ్యులకు ఎంతో ఊరట కలుగుతోంది. ఆ చిన్నారుల భవిష్యత్తుకు ఆ డబ్బు ఎంతగానో ఉపయోగపడుతుందని అందరూ భావిస్తున్నారు.

### అంతిమ సంస్కారాలకు రూ.15వేలు

కరోనాతో బాధపడుతూ మృతిచెందినవారి అంతిమసంస్కారాల బాధ్యతను కూడా ప్రభుత్వమే నిర్వహించాలని నిర్ణయించింది. అందుకు అంత్యక్రియల నిమిత్తం 15 వేల రూపాయలు అందించాలని కూడా సిఎం ఆదేశించడం విశేషం. అయితే, ఈ విషయంలో అధికార వర్గాల్లో లోలోపలే తర్జనభర్జనలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య విషయంలో ఖచ్చితత్వం లేదనే విమర్శలు వస్తున్న నేపథ్యంలో మృతుల కుటుంబాలకు 15వేలు ప్రభుత్వం ప్రకటించింది కనుక మృతుల కుటుంబాల వారు ఆ డబ్బు కోసం తమ పేర్లు నమోదు చేయాలని పట్టుబడితే ప్రభుత్వానికి కొత్త చిక్కులు వస్తాయోమోనని భావిస్తున్నారు. మరణాల నమోదు విషయంలో ఏ మాత్రం పొరపాటు వచ్చినా మృతుల కుటుంబాలకు అందే ఆ 15వేలు అందని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విషయాలన్నీ ఆచరణలో ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తాయో వేచి చూడాల్సిందే మరి!..

# 'ముత్తుకూరు మందు'కి ఎగబడ్డ జనం

- వేలల్లో క్యూ కట్టిన కరోనా బాధితులు
- పంపిణీ నిలిపేసిన అధికారులు

***కొద్ది రోజుల క్రితం జిల్లాలో ఎక్కడ విన్నా.. 'ముత్తుకూరు మందు' మాటే!.. ఆ ఆయుర్వేద మందు కోసం జనం వేలల్లో క్యూ కట్టారు కూడా. ఆ మందు వేసుకుంటే కరోనా రాదంటూ ఊళ్ళల్లో ప్రచారం జరగడంతో ఒక్కసారిగా పెద్దఎత్తున కరోనా బాధితులు ఆ మందు కోసం ఎగబడ్డారు. ఓ ఆయుర్వేద వైద్యుడు ఆ మందు తయారుచేస్తున్నారని, అది కరోనాకి బాగా పనిచేస్తుందని తెలిసి కరోనా బాధితులు పెద్దసంఖ్యలో అక్కడికి వెళ్తుండడంతో.. చివరికి ఎటొచ్చి ఏమవుతుందోనంటూ అధికారులు పరుగు పరుగున వెళ్లి ఆ మందు తయారీని నిలిపేశారు.***

కరోనా బాధితులకు ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నంలో ఉన్న ఓ ఆయుర్వేద వైద్యుడు ఇచ్చే మందు ఎంతో ఉపయోగపడుతుందని, అది బాధితుల ప్రాణాలను నిలబెడుతోందని ఊళ్ళల్లో ప్రచారం జరుగుతుండడంతో ఒక్కసారిగా కరోనా బాధితుల్లో ఆశలు రేకెత్తాయి. అసలే కరోనా వీరవిహారం చేస్తూ జనం ప్రాణాలు తీస్తున్న నేటి పరిస్థితుల్లో ఆయుర్వేద మందు కరోనాకి బాగా పనిచేస్తోందనే నమ్మకం ఉన్నవారంతా ఎక్కడెక్కడి నుంచో కృష్ణపట్నానికి తండోపతండాలుగా వెళ్ళారు. ఆయుర్వేద మందుల్లో వాడే వేపాకు, పసుపు, మిరియాలు వగైరాలన్నీ కలిపి చేస్తున్న ఈ మందు కరోనాను తప్పకుండా నివారిస్తోందని, అసలు కరోనా రాకుండే ఉండేందుకు, వచ్చినా ప్రాణాపాయం లేకుండా చేసేందుకు ఈ మందు భలే బాగా పని చేస్తోందని, ఆ మందు వాడుకున్నవారు ఎంతో మంది చెప్తుండడంతో ఆ విషయం ఆనోటా ఈనోటా పాకి జిల్లా ఎల్లలు దాటి చుట్టుపక్కల రాష్ట్రాల బాధితులను కూడా కృష్ణపట్నానికి కదిలించింది. అందులోనూ ఈ మందును ఉచితంగానే అందిస్తుండడంతో జనం ఈ మందు కోసం పెద్ద సంఖ్యలో ఎగబడ్డారు. దీంతో కృష్ణపట్నం గ్రామమంతా జనమయంగా మారింది.

కార్లు, వాహనాల రద్దీ కూడా ఉన్నట్లుండి భారీగా పెరిగిపోయి ట్రాఫిక్ సమస్యలు కూడా ఏర్పడ్డాయి. ఇంతలోనే ఏం జరిగిందో తెలియదు కానీ లోకాయుక్తకు ఎవరో ఫిర్యాదు చేశారంటూ ఒక్కసారిగా అధికారులు హుటాహుటిన కృష్ణపట్నానికి వచ్చి ఆ మందు పంపిణీని నిలిపేశారు. ఆ మందుల్లో వినియోగించే ఆకులు, దినుసులు, వాటి పనితీరు, ఫలితాలను పరీక్షించాలని, ఈ మందు అసలు కరోనా నివారణకు పనికొస్తుందో లేదో నిర్ధారించేదాకా ఆ మందు తయారీని నిలుపుదల చేయాలని చెప్పడంతో ఆ వైద్యుడు మందు తయారీ నిలిపేసినట్లు సమాచారం. ఈ ఆయుర్వేదం మందుపై లోకాయుక్తకు అధికారులు నివేదిక పంపారని, ఆ మందు శ్యాంపిల్స్ తీసుకుని లాబొరేటరీలకు పంపి, ఫలితాలు వచ్చిన తర్వాత ఏం చేయాలో అధికారులు నిర్ణయిస్తారని తెలుస్తోంది. అప్పటిదాకా 'ముత్తుకూరు మందు' తయారీకి నిర్వాహకులు విరామం ప్రకటించినట్లు తెలుస్తోంది.




# నెల్లూరులోనూ సీటీ స్కాన్, ఎంఆర్ఐ మిషన్లు

## వర్చువల్‌గా ప్రారంభించిన సిఎం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదిన రాష్ట్రంలోని పలు ఆసుపత్రుల్లో సీటీ స్కాన్, ఎంఆర్ఐ మిషన్లను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. అందులో నెల్లూరులోని పెద్దాసుపత్రి కూడా ఉంది. నెల్లూరుతో పాటు కడప, ఒంగోలు, శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రుల్లో ఈ మిషన్లను సిఎం ప్రారంభించడం విశేషం.

ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రులను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని, పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. రాష్ట్రంలో 11 టీచింగ్ ఆసుపత్రుల్లో కేవలం ఏడు ఆసుపత్రుల్లో మాత్రమే సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరికరాలు ఉన్నాయని, అవి కూడా పిపిపి పద్ధతిలో ఉన్నాయని, వాటిలో టెక్నాలజీ కానీ క్వాలిటీ కానీ అభివృద్ధి కాలేదని అంటూ ఆ పరిస్థితి మారాలని ఈ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

### కొత్తగా మరో 16 టీచింగ్ ఆసుపత్రులు

రాష్ట్రంలో కొత్తగా మరో 16 టీచింగ్ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే ఉన్న 11 టీచింగ్ ఆసుపత్రులను కూడా నాడు-నేడు పథకం కింద అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, కొత్తగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో టీచింగ్ ఆసుపత్రితో పాటు నర్సింగ్ కాలేజీని కూడా ఏర్పాటు చేస్తున్నామని సిఎం జగన్ వివరించారు.



### రెడ్‌క్రాస్ ఛైర్మెన్ దాతృత్వం
# కోవిడ్ బాధితుల కోసం ఆక్సిజన్ బస్సులు



నెల్లూరు రెడ్‌క్రాస్ ఛైర్మెన్, కృష్ణచైతన్య విద్యాసంస్థల అధినేత పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తమ విద్యాసంస్థలకు చెందిన రెండు బస్సులను కోవిడ్ బాధితుల కోసం రెడ్‌క్రాస్‌కు అందజేసి తన సేవాభావం చాటుకున్నారు. ఈ ఆక్సిజన్ బస్సులను నెల్లూరులోని పెద్దాసుపత్రి బాధితుల కోసం కేటాయించారు. వీటిని ఈనెల 17న మంత్రులు గౌతంరెడ్డి, డా.అనిల్ ప్రారంభించి మాట్లాడుతూ ఈ బస్సుల్లో కోవిడ్ బాధితులకు అవసరమైన ఆక్సిజన్ సిలిండర్లు కూడా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అంతేకాక బాధితులు కూర్చునేందుకు, పడుకునేందుకు వీలుగా బస్సుకు 9 సీట్ల వంతున ఏర్పాటు చేశారని, ప్రతి బస్సులో 8 ఆక్సిజన్ కాన్సెన్‌ట్రేట్లు, ఒక ఆక్సిజన్ సిలిండర్, ప్రతి సీటుకు ఫ్యాను, లైటు వగైరా వసతులన్నీ సమకూర్చారని, కోవిడ్ బాధితులకు ఆక్సిజన్ బెడ్ అవసరమైతే ఈ బస్సులను వినియోగిస్తామని చెప్పారు.

# పాత్రికేయులను ఆదుకోండి
### మంత్రి అనిల్‌కు జర్నలిస్టుల సంఘం నాయకుల వినతి



కరోనా నేపథ్యంలో జిల్లాలో పాత్రికేయుల పరిస్థితి దయనీయంగా ఉందని, పలువురు పాత్రికేయులు కరోనా వ్యాధి బారినపడి మరణించడం ఎంతో బాధాకరమని, వారి కుటుంబాలను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్‌కు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు వినతిపత్రం సమర్పించారు. ఈనెల 17న వారు నెల్లూరులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి జిల్లాలోని జర్నలిస్టుల పరిస్థితిని వివరించారు. కరోనాతో గత ఏడాది పలువురు జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారని, ఇప్పుడు రెండోదశ కరోనాలో ఆరుగురు జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యులు కరోనా సోకి చనిపోయారని తెలిపారు.

## స్పందించిన మంత్రి అనిల్

కరోనా విపత్కర పరిస్థితుల్లో జర్నలిస్టులకు అండగా తాను ఉన్నానంటూ మంత్రి అనిల్ స్పందించారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో కరోనాతో మృతి చెందిన ఇద్దరు జర్నలిస్టులకు 50వేల రూపాయల చొప్పున వారి కుటుంబాలకు మంత్రి అనిల్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కోవిడ్ బారిన పడిన జర్నలిస్టులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

# కిరణ్మయిని అభినందించిన విఎస్‌యు అధికారులు



రాష్ట్రస్థాయి నిపుణుల అప్రైజర్ కమిటీ (ఏపిఎస్ఇఏఏ) సభ్యురాలిగా నియమితురాలైన విక్రమసింహపురి యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం అధిపతి కిరణ్మయిని ఇటీవల విఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుజానాయర్‌లు శాలువా కప్పి అభినందించారు. కిరణ్మయి నియామకానికి సంబంధించి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వశాఖ గెజిట్‌ను విడుదల చేసిందని, మూడేళ్ళపాటు ఆమె ఆ కమిటీలో సభ్యురాలిగా ఉంటారని విఎస్‌యు వర్గాలు తెలిపాయి.

# నెల్లూరు కబుర్లు

### ఇన్‌చార్జి డిఎస్‌ఓగా
# ఎంవి సుధాకర్



జిల్లా పౌర సరఫరాల శాఖ ఇన్‌ఛార్జి అధికారిగా అదే శాఖలో విజిలెన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డెప్యూటీ కలెక్టర్ సుధాకర్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఇటీవల ఆదేశాలు జారీచేయడంతో సుధాకర్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. గత కొంతకాలంగా ఆ పోస్టు ఖాళీగా ఉండడంతో ఆ స్థానానికి ఇన్‌చార్జి అధికారిగా సుధాకర్‌ను కలెక్టర్ నియమించినట్లు సమాచారం.

### బిఎస్ఎన్ఎల్ అధికారి
# గోపాలకృష్ణ మృతి

బిఎస్ఎన్ఎల్ జిల్లా ఇన్‌ఛార్జి అధికారిగా పనిచేస్తున్న గోపాలకృష్ణ కరోనా కాటుతో మృతిచెందారు. కొద్దిరోజుల క్రితం ఆయన కరోనాకు గురై తిరుపతిలోని ఓ ఆసుపత్రులో చికిత్సపొందుతూ ఇటీవల కన్నుమూశారు. కొంతకాలం క్రితం ఆయన తిరుపతి జనరల్ మేనేజర్‌గా కూడా పనిచేసి ఇటీవలే నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఆయన మృతితో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర విచారానికి గురయ్యారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

### పారిశుద్ధ్య కార్మికులకు
# మాస్కులు పంపిణీ

నెల్లూరు నగరంలోని 48వ వార్డులో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో ఇటీవల మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ మాట్లాడుతూ నిత్యం విధుల్లో ఉండే పారిశుద్ధ్య కార్మికులు మాస్కులు ధరించి కోవిడ్‌కు దూరంగా ఉండాలని కోరారు. ఆర్.శ్రీనివాసులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### 15 నిమిషాల్లోనే
# కోవిడ్ ఫలితాలు

నెల్లూరు, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 16వ తేదీ నుంచి ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 8గంటల వరకు కోవిడ్ ర్యాపిడ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. పరీక్షలు చేసిన 15 నిమిషాల్లో ఫలితాలను స్టేడియం వద్దనే తెలియజేస్తున్నామని ఆయన వెల్లడించారు.



### కొత్త జేసీగా
# గణేష్‌కుమార్

జిల్లా జాయింట్ కలెక్టర్ (అభివృద్ధి)గా గణేష్‌కుమార్ ఈనెల 17న నెల్లూరు కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి దాకా జేసీగా పని చేసి బదిలీ అయిన ప్రభాకర్‌రెడ్డి స్థానంలో గణేష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన తొలుత జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబును క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. కొత్త జేసీకి 'లాయర్' శుభాకాంక్షలు.

# ఆదిశంకర జయంతి

జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు నెల్లూరులోని పొగతోటలో చక్రాల ట్రస్ట్ వారు నిర్మించిన ఆదిశంకర ధ్యాన మందిరంలో ఇటీవల జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆదిశంకరాచార్యుల వారు 32 సంవత్సరాలు జీవించారని, ఆ కాలంలోనే స్వామివారు మూడుసార్లు ఆసేతు హిమాచల పర్యంతం పర్యటించి ధర్మోద్ధరణ చేసి, అద్వైత మతస్థాపన చేశారని పేర్కొన్నారు. ఈ జయంతి ఉత్సవాలలో భక్తులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ శ్రీ ఆదిశంకరాచార్యుల వారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చక్రాల వెంకటలక్ష్మి, నరసింహం, ఆనందకుమార్, వెంకట శ్రీకాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

### వైకాపా నేత..
# అల్లారెడ్డి కన్నుమూత

వైకాపా జిల్లా కార్యదర్శి అల్లారెడ్డి సతీష్‌రెడ్డి అనారోగ్యంతో ఈనెల 15న కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన సతీష్‌రెడ్డి నెల్లూరులో నివాసముంటున్నారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఆయన సోదరుడు, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి తెలిపారు. సతీష్‌రెడ్డి మృతిపట్ల రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా తన సంతాపం వ్యక్తంచేశారు.

### మృతుల కుటుంబాలకు..
# పరిహారం ఇవ్వండి
### - ఏపిఎన్‌జీఓల సంఘం నాయకుల వినతి



ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ కరోనా బారిన పడి మృతిచెందిన వారి కుటుంబాలను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని ఏపి ఎన్‌జీఓల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయవర్మ కోరారు. ఇటీవల నెల్లూరులో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యఆరోగ్య శాఖలో డాక్టర్ సుజాత, హెడ్‌నర్సు హెలెన్, ఆరోగ్య కార్యకర్త చంద్రకళ, నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న తమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్‌రావు.. ఇలా పలు శాఖల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు, ఉద్యోగులు కరోనాకు గురై మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెందిన వారి కుటుంబాలకు చేయూతగా 50 లక్షల పరిహారం అందజేయాలని ఆయన కోరారు. కరోనాకు గురైన ఉద్యోగుల విషయంలో జిల్లా కలెక్టర్ ఎంతో శ్రద్ధచూపి వారికి మెరుగైన వైద్యసేవలందిస్తున్నారని ఈ సందర్భంగా కలెక్టర్‌కు తమ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు గిరిధర్, వెంకటేశ్వర్లు, పెంచలరావు, రమేష్‌బాబు, పెంచలయ్య, మధు, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

### కరోనా బాధిత సహాయకులకు..
# టిడిపి నాయకుల సాయం

నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కరోనా బారిన పడినవారి కుటుంబసభ్యులు, వారి సహాయకులకు టిడిపి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ సహకారంతో అన్నం ప్యాకెట్లు వితరణగా అందజేస్తున్నారు. టిడిపి నాయకుడు సాబిర్‌ఖాన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం పదిహేను రోజులపాటు నిర్వహిస్తామని తెలిపారు. కర్ఫ్యూతో హోటళ్ళు, రెస్టారెంట్లు లేకపోవడంతో కరోనా బాధితుల కోసం వచ్చే సహాయకులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి అన్నం కూడా సక్రమంగా దొరకడం లేదని, ఈ పరిస్థితిని గమనించిన అజీజ్ వారికి భోజన సదుపాయం కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జలదంకి ప్రభాకర్, మైనార్టీ నాయకులు జియి ఉల్ హక్, మాజీద్, అస్లాం, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్లపై ఆరోపణలు దారుణం
### ఐఎంఏ నాయకుల ఆవేదన

కరోనా బాధితులకు ప్రాణాలకు తెగించి చికిత్స చేస్తున్న వైద్యులను రాజకీయాల్లోకి లాగవద్దని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేతలు హితవు పలికారు. ఇటీవల నెల్లూరులోని ఐఎంఏ హాలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసతేజ, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ అధ్యక్షుడు ఎంవీవీ ప్రసాద్ మాట్లాడుతూ కొందరు రాజకీయనాయకులు వైద్యులపై చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. కరోనా బాధితుల నుంచి వైద్యులు అక్రమార్జనకు పాల్పడుతున్నారన్న ఆరోపణలలో వాస్తవం లేదన్నారు. ఐసీఎంఆర్ సూచనల ప్రకారం ఎంబీబీఎస్ వైద్యులు కరోనాకు చికిత్స అందించవచ్చన్నారు. వైద్యులలో కొందరు అనేక రాజకీయ పార్టీలకు చెందిన వారు ఉండవచ్చని, అయినా వారు రోగులకు రాజకీయాలకు అతీతంగా సేవలు అందిస్తుంటే వారు దోపిడీ దొంగలన్నట్లుగా ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ఆసుపత్రుల్లోనే డాక్టర్లు కరోనా వైద్యసేవలు అందిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రూపేష్, డాక్టర్ రాహుల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసి కార్మికులకు మందుల కిట్లు

ఆర్టీసి కార్మికులు కరోనా బారిన పడితే వారికి తక్షణ వైద్యసాయంగా అందించేందుకు కరోనా నివారణ మందుల కిట్లను ఆర్టీసి ఉన్నతాధికారులు సిద్ధం చేశారు. ఇటీవల కోవూరులోని ఆర్టీసి వర్క్‌షాప్‌లో కార్మికుల కోసం నూరు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసి రీజనల్ మేనేజర్ పివి శేషయ్య మాట్లాడుతూ కోవిడ్ పాజిటివ్ వచ్చినవారు ముందుగా ఈ కిట్లను ఉపయోగించడం ఎంతో అవసరమన్నారు. వైద్య ఆరోగ్యశాఖ వారు ఒక్కో కిట్టులో పది రకాల మందులను ఇచ్చారని, జిల్లాలోని పది ఆర్టీసి డిపోలతో పాటు వర్క్‌షాప్‌లో కూడా వంద కిట్ల చొప్పున పంపిణీకి సిద్ధంగా ఉంచామని చెప్పారు.

# పెద్దాసుపత్రిలో అదనపు పడకలు

- ప్రత్యేక జర్మన్ షెడ్‌లో 50 బెడ్‌లు
- ప్రారంభించిన మంత్రులు అనిల్, గౌతంరెడ్డి



నెల్లూరు పెద్దాసుపత్రిలో కరోనా బాధితుల కోసం మరో 50 పడకలతో ప్రత్యేక జర్మన్ షెడ్ విభాగం ఏర్పాటైంది. దీనికి ఈనెల 17న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ అనిల్, పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఇక్కడ అదనపు పడకలు ప్రారంభించడం జరిగిందని, అదేవిధంగా బాధితులకు ఆక్సిజన్ కొరత లేకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. రోజురోజుకు కోవిడ్ కేసులు పెరుగుతుండడంతో జిల్లాలోని కోవిడ్ ఆసుపత్రుల్లో బెడ్‌లను పెంచుతున్నామన్నారు. జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ కరోనా నిర్ధారణ పరీక్షలు మరింత వేగవంతం చేస్తున్నామని, రోజుకు కనీసం 8 వేల పరీక్షలు చేస్తున్నామని చెప్పారు.

## ఆక్సిజన్ కోసం మరిన్ని చర్యలు

రాష్ట్రంలో మూతపడిన ఆక్సిజన్ ప్లాంట్లను వినియోగంలోకి తెచ్చి ఆక్సిజన్ ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆక్సిజన్ కొరతను అధిగమించేందుకు కొత్త ఇండస్ట్రియల్ పాలసీని తీసుకువస్తామని మంత్రి గౌతంరెడ్డి చెప్పారు. ఈనెల 17న ఆయన జిల్లాలోని చిల్లకూరు మండలం బూదనంలో ఉన్న ఆక్సిజన్ ప్లాంట్‌ను మంత్రి అనిల్‌తో కలసి సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 రోజుల్లో వెయ్యి మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తిరుపతి ఎంపి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు ఉద్యోగులకు.. కరోనా షాక్

- 5 జిల్లాల్లో 6 వందల మందికి కోవిడ్
- ఇప్పటికే 36 మంది మృత్యువాత
- ఆవేదనలో అధికారులు, సిబ్బంది

కరెంటు ఉద్యోగుల పాలిట కరోనా మృత్యుపాశమవుతోంది. అనేకమంది ఉద్యోగులు, సిబ్బంది కోవిడ్ బారిన పడుతుండడం, కొందరు చనిపోతుండడంతో విద్యుత్‌శాఖ షాక్‌కు గురవుతోంది. విద్యుత్ సంస్థ పరిధిలోని నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటిదాకా దాదాపు ఆరువందల మంది కరోనా బారిన పడి బాధలు పడుతున్నట్లు ఒక అంచనా. వీరిలో సుమారు 36 మంది దాకా మరణించారని కూడా అంటున్నారు. దీంతో విద్యుత్ ఉద్యోగులు తీవ్ర ఆవేదనకు, ఆందోళనకు గురవుతున్నారు. చనిపోయిన వారిలో పలువురు డెప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో పాటు 11 మంది లైన్‌మ్యాన్‌లు కూడా ఉన్నట్లు సమాచారం. దీంతో ఆయా విభాగాల్లో సిబ్బంది విధులకు హాజరు కావడానికి భయపడుతున్నారు.

### ధైర్యంగా ఉండాలి..

# కోవిడ్ నుంచి కోలుకోవాలి

- బాధితులకు ఫోన్ ద్వారా ఎంపీ ఆదాల ఊరడింపు -



కోవిడ్ వైరస్ నుంచి అందరూ త్వరగా కోలుకోవాలని, మనోధైర్యంతో ఉంటే ఆ వ్యాధి నుంచి తొందరగా బయటపడవచ్చని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి బాధితులకు ధైర్యం చెప్పారు. ప్రకాశం జిల్లా కందుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన క్వారంటైన్ కేంద్రాన్ని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనలతో విజయ డైరీ ఛైర్మన్ రంగారెడ్డి ఆదివారం సందర్శించారు. ఆయనతోపాటు కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి కోవిడ్ బాధితుల బాగోగులను ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న సౌకర్యాల గురించి, ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కోవిడ్ బాధితులు డాక్టర్లు ఇస్తున్న మందులను క్రమబద్ధంగా, సక్రమంగా వినియోగించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా విజయ డైరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆక్సిజన్ కొరత విషయాన్ని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సీఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారని, సీఎం జగన్ అందుకు స్పందించి ఎంపీ సూచనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కందుకూరు మునిసిపాలిటీ కోసం అడిగిన ఒక జేసీబీ, ఒక ట్రాక్టర్‌లను సమకూర్చేందుకు ఎంపీ అంగీకరించారని, కందుకూరు ప్రజలకు ఎంపీ ఆదాల ఎప్పుడూ అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# సంస్మరణ

మా అభ్యున్నతికి కారకులు, మాకు స్ఫూర్తిప్రదాతలు
బంధుజనప్రియులు, సమతావాది

## పూండ్ల చెంచురెడ్డి గారు

పరమపదించి తేది. 27.05.21 నాటికి
ముప్పైమూడు సంవత్సరాలు నిండుతాయి.

**ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకొంటూ...**

భార్య :
**లేట్ పూండ్ల కామేశ్వరమ్మ**

కుమారులు :
**డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి**
**పూండ్ల వెంకురెడ్డి**
మరియు
**కుటుంబసభ్యులు**

# టీకా ఎందుకు దండగ... గోమూత్రం ఉండగా!?





మిగతా ప్రపంచం సంగతి ఏమో గానీ.. కరోనా వైరస్ మన దేశాన్ని పీల్చి పిప్పి చేసేస్తుంటే... వాక్సినో రామచంద్రా అంటూ జనం హాహాకారాలు చేస్తున్నారు. భర్తల కళ్ళముందు.. భార్యలు, భార్యల కళ్ళ ముందు భర్తలు.. కొడుకుల కళ్ళముందు తల్లితండ్రులు, నిండు గర్భిణీలు... నవ వధువులు.. వేలకు వేలమంది అనునిత్యం ఈ కరోనా మహమ్మారి బారిన పడుతున్నారు. ప్రభుత్వ పరంగా వైద్య, ఆరోగ్య శాఖలు ఉన్నాయి గానీ... జనానికే ఎటొచ్చి ఆరోగ్యమూ లేదు. వైద్యమూ లేదు. తగినన్ని వాక్సిన్ నిల్వలు స్టాకు పెట్టుకుందామనే ముందుచూపు ప్రభుత్వానికి లేకుండా పోయిందంటూ ప్రతిపక్షాలు కేంద్రాన్ని తూర్పారబడుతున్నాయి. కరోనా వాక్సిన్ సంగతి వదిలేసి, బెంగాల్... బెంగాల్ అంటూ తిరిగి దేశాన్ని ముంచేశారు మొర్రో అంటూ ప్రధాని మోడీని మేధావంతులు, రచయితలు, కళాకారులు కడిగి పారేస్తున్నారు. మీరేం చేయకపోయినా ఫర్లేదుగానీ, ఆ గెడ్డం తీసేద్దురూ అంటూ ఓ వివాదాస్పద సినిమా డైరెక్టర్ ఓ ట్వీట్ కూడా పెట్టారంట. భారత్ బయోటెక్ ఒక్కటే వాక్సిన్‌ను కావలసినంత ఉత్పత్తి చేయలేకపోతున్నదని, ఆ ఫార్ములాను మరో మూడు ఫార్మా కంపెనీలకు ఇప్పించి, వాక్సిన్‌ను మూడు, నాలుగు, అయిదు రెట్లు పెంచాలని కేంద్రం ఆలోచిస్తున్నది. చాలా రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ టీకా కోసం గ్లోబల్ టెండర్లు... గ్లోబల్ టెండర్లు అంటూ హడావుడి చేస్తున్నాయి. వాక్సిన్...వాక్సిన్ అంటూ వచ్చే... ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకోలేక పూణేలోని సీరం ఇన్స్టిట్యూట్ ఓనరు పూనావాలా కుటుంబంతో సహా లండన్‌కు జంప్ అయిపోయారు. దొడ్డి దోవన వాక్సిన్ 'తయారు చేసి', 'మమ...' అనడం ఇష్టం లేని 'శాంత బయోటెక్' సారధి, వాక్సిన్‌కింగ్ వరప్రసాద్‌రెడ్డి ఇంటి పట్టునే ప్ర'శాంత'ముగా ఉంటున్నారు.

ఈలోగా 'నేనూ ఉన్నానోచ్' అంటూ రష్యా వాక్సిన్ దిగేసింది. ఇంకో నాలుగైదు వాక్సిన్ల కంపెనీలకు ఇండియా మార్కెట్ చూసి.. నోళ్ళల్లో నీళ్లూరుతున్నాయి. మరి దగ్గరి దగ్గర 140 కోట్ల జనాభా కదా! ఒక్కో వాక్సిన్ ఒక్కొక్కరికీ రెండుసార్లు వేయాలి. అద్దిరిపోయే వ్యాపారం.






అయినా... వాక్సిన్లు వేసేదాకా ఆగకుండా రోజుకు ఓ నాలుగు వేలమంది జనం చనిపోతున్నారు. ఇంకో మూణ్ణెల్లల్లో అందరికీ వాక్సిన్లు వేస్తాం.. కాస్త ఆగండ్రా బాబూ అంటుంటే.. ఒక్కడూ వినడం లేదు. శవమై గంగలో ఈ చివరి నుంచి ఆ చివరి దాకా తేలుతూపోతున్నారు. గంగానదిలో రోజూ తేలుతున్న శవాలను చూడలేక 'పెద్దసారు'లు గెడ్డాలు... మీసాలు పెంచేసుకుని తలుపులు బిడాయించుకుని... యోగముద్రలో కూర్చుంటున్నారు.

అవునా...!? అయితే..

వైరస్‌కు మందు ఎక్కడో లేదు. తెలుసుకుంటే మన కళ్ళముందే ఉంది. మన పెరట్లో ఉంది. మన ఇంటి ముందే ఉంది. అసలు, కరోనా అనే కాదు.... దాని బాబు లాంటి వైరస్ వచ్చినా ఫికర్ లేదు అంటున్నారు, ఉత్తరప్రదేశ్ బీజేపీకి చెందిన ఈ ఎం.ఎల్.ఏ సురేంద్రసింగ్.

"వాక్సిన్... వాక్సిన్ అంటూ ఆపసోపాలు పడతారెందుకు? ఇదుగో గోమూత్రం. నేను రోజూ పరగడుపునే ఓ గ్లాసుడు ఫ్రెష్‌గా గోమూత్రం తాగుతాను. అందులో చిటికెడు పసుపు కూడా వేసుకుంటా. నేను రోజూ బోలెడంత మందిని కలుస్తుంటాను. చూడండి. ఎంత ఆరోగ్యంగా ఉన్నానో! కరోనా అనే కాదు. ఏ వైరస్ కూడా ఏమీ చేయలేదు. మాస్క్ కూడా పెట్టుకోను. చాలా రోగాలకు ఈ గోమూత్రమే దివ్యవుషధం. ఈ విషయం మన పూర్వీకులే చెప్పారు. ఈ సైన్సును నమ్ముకుంటే మన పని అయినట్టే. అందరూ గోమూత్రం తాగండి." అంటూ ఆయన కుండబద్దలు కొట్టినట్టు దేశ ప్రజలకు దిశా నిర్దేశం చేశారు. ఆయనేమీ వేలిముద్ర బ్యాచ్ కూడా కాదు. పోస్ట్ గ్రాడ్యుయేట్. డబుల్ ఎం.ఏ. ఎంఈడీలో ఒక పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ. సోషియాలజిలో ఒక పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పొందారు.

అంత జ్ఞాని, ఉన్నత విద్యావంతుడు కాబట్టి, సహజంగానే బీజేపీలో చేరారు. ఉత్తరప్రదేశ్‌లోని బలియా జిల్లాలోని బైరియా నియోజకవర్గం నుంచి మొన్న 2017లో ఎం.ఎల్.ఏగా ఎన్నికయ్యారు.

అందువల్ల, ఇప్పటికైనా వాక్సిన్ల కోసం, మందుల కోసం వెంపర్లాట ఆపేయవచ్చు.., ప్రతి ఆసుపత్రికి అనుబంధంగా ఒక గోశాలను చేయవచ్చు. ఆ ఆసుపత్రి పరిధిలోని జనానికి, పరగడుపునే తలా ఓ గ్లాసు గోమూత్రం అందించే విధంగా... సరిపడినన్ని గోశాలలు ఏర్పాటు చేయవచ్చు. ప్రైవేట్ రంగంలో గోశాలలు ఏర్పాటు చేయాలనుకునే వారిని ప్రోత్సహించి, గోవుల కొనుగోలు, పోషణకు అయ్యే ఖర్చులో కొంత సబ్సిడీ ఇవ్వవచ్చు. పాల సేకరణ కేంద్రాల లాగా గోమూత్ర సేకరణ కేంద్రాలు విస్తృతంగా ఏర్పాటు చేయవచ్చు. సైన్సును మాత్రమే నమ్ముకున్న అమెరికా, యూరప్, జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి గోవులను పెద్దఎత్తున దిగుమతి చేసుకోవచ్చు. గోమూత్రంతో వారికి పనిపడదు కదా! అలాగే, గోవు పొడ గిట్టని ముస్లిం దేశాల నుంచి ఆవులను దిగుమతి చేసుకోవచ్చు. ఈ కార్యకలాపాల వల్ల నిరుద్యోగం అన్న సమస్య ఉండదు. ప్రతి నిరుద్యోగికి రెండు ఆవులు ఇస్తే వారే దర్జాగా బతుకుతారు, ఇంటింటికీ గోమూత్రం సరఫరా చేస్తూ. ఉపాధికి ఉపాధి. ఆరోగ్యానికి ఆరోగ్యం. పాలకు పాలు.

అయితే, సామాజిక స్వార్ధపరులు కొందరు ఈ గోమూత్రాన్ని... ఇతర మూత్రాలతో కల్తీ చేసి, గోమూత్రం అంటూ బ్లాక్‌లో చెలామణి చేసే అవకాశం ఉంది. కనుక, 'గోమూత్ర కల్తీ నిరోధక' శాఖను ఏర్పాటు చేయవచ్చు. ఈ చర్యలు పకడ్బందీగా చేపట్టవచ్చు. ఇందుకోసం ఎక్కడికక్కడ టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చెయ్యవచ్చు. దేశంలోని ప్రతి పౌరుడు నిద్రలేవగానే... ఓ గ్లాసుడు గోమూత్రం నిర్బంధ సేవనం చేసే ఏర్పాటు చేయగలిగితే... వైద్య-అనారోగ్య శాఖ మీద దేశంలోని ప్రభుత్వాలు ఏటా ఖర్చు చేస్తున్న లక్షలాది కోట్లు ఆదా చెయ్యవచ్చు. మెడికల్ కాలేజీల స్థానంలో.. గోమూత్రాభివృద్ధి కేంద్రాలు, గోమూత్ర పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేయవచ్చు. ఫార్మా కంపెనీలు, వాక్సిన్ కంపెనీలను మూసేయించవచ్చు. గోశాలల ఏర్పాటు ద్వారా పాలకు... పాలు మూత్రానికి మూత్రం. ఎటు చూస్తే, అటు ఆరోగ్యం. జబ్బులు, వైరస్లు లేని ఆరోగ్య సమాజం.

మధ్యప్రదేశ్ నుంచి లోకసభకు మొన్న 2019లో ఎన్నికైన ప్రజ్ఞాఠాగూర్ అనే బీజేపీ మహిళా జ్ఞాని తాను రోజూ గోమూత్రమే పరగడుపున తాగుతానని తనకు కరోనా సమస్యే లేదని చెప్పారు. (జ్ఞానులు కాని వారికి బీజేపీలో చోటు ఉండదు). నిజానికి ఈ ఇద్దరు ప్రజాప్రతినిధులు నిజాయతీగా తమ మనసులోని మాటను బయటకు చెప్పారు గానీ ఈ అభిప్రాయాలను లోపల్లోపలే అంగీకరించేవారు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరించి ఉన్నారు.

ఈ జ్ఞానుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని గోమూత్రం మీద ఆధారపడడాన్ని మించిన ప్రత్యామ్నాయం మన జనానికి లేదని బల్ల గుద్ది వాదించవచ్చు.

ఎందుకంటే- మనకు 'వాటిని' పెంచడం మీద ఉన్న శ్రద్ధ, జనం బాగోగులమీద, వాళ్ళ ఆరోగ్యం మీద ఉండదు. వారి ఓట్ల మీద ఉన్న శ్రద్ధ ..వారి బాగోగులమీద ఉండదు. మన రాజకీయ ప్రత్యర్థులను శంకరగిరి మాన్యాలు పట్టించడం మీద ఉన్న పట్టుదల... ప్లానింగ్ మీద ఉండదు. భారతీయ ఋషులు, స్వాముల ప్రవచనాల పట్ల ఉన్న గౌరవం సైన్సుపై ఉండదు. కీర్తి కండూతిపై ఉన్న యావ.. జనం యోగక్షేమాలపై ఉండదు. జనం గోల ఏమిటో వినాలనే ఆసక్తి ఉండదు. ఆస్పత్రులు... పడకలు... ఆక్సీజెన్ కొరతలు... వెంటిలేటర్లు... మందుల కొరత అంటూ ప్రతిపక్షాల గావు కేకలు. మన జనాభాకు ఇవి ఎటుదిరిగీ సక్రమంగా అందించలేము. మన బడ్జెట్ లక్షల కోట్లలో ఉంటుంది. ప్రభుత్వాలకు సలహాలు ఇవ్వడానికి ఐ.ఏ.ఎస్‌లు, శాస్త్రవేత్తలు, ప్రణాళికల రూపకర్తలు, ఆయా విభాగాల్లో నిష్ణాతులైన సలహాదారులు పెద్ద సంఖ్యలో ఉంటారు. అయినా కరోనా వంటి మహమ్మారి విరుచుకుపడితే.. దేశం మొత్తం అతలాకుతలమైపోతుందని తెలిసినా...ముందస్తు ప్రణాళికలు, జాగ్రత్తలు,మందుల నిల్వలు, అవసరమైన ఆక్సిజెన్ ప్రణాళికలు, వెంటిలేటర్లు సమకూర్చుకోవడం మొదలైన ప్రజారక్షణ చర్యలపై ఎంతమంది అధికారులు, సలహాదారులు ఎంత చెప్పినా మనం పట్టించుకోము. పట్టించుకోవడం వల్ల రాజకీయ ప్రయోజనాలు ఏమీ లేవు. ఆ సంగతి శాస్త్రవేత్తలకు, సలహాదారులకు తెలియదు. ఈ లంపటం... కువిమర్శలకు తావులేకుండా... సర్వరోగాలకూ గోమూత్రం మీద ఆధారపడడం అంత బెస్ట్ ఇంకోటిలేదు. పనిలో పనిగా ఇతర మూత్రాలకు ఉండడానికి అవకాశం గల ఆరోగ్య పరిరక్షణ లక్షణాలపై విస్తృత పరిశోధనలు చేయిస్తే ఏ రుగ్మతకు ఏ మూత్రం తాగాలో ప్రజలకు తేలికగా అర్థమవుతుంది. అప్పుడు... ఆక్సిజన్, వెంటిలేటర్లు, కాంసెంట్రేటర్, మందులు, వాక్సిన్లు, ఆస్పత్రులు, బెడ్లు, ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీలు, కోర్టుల అక్షింతలు, అధికారులు, నేతల ఉత్తుత్తి సమీక్షలు, పోలీసుల హెచ్చరికలు, రోడ్ల మీద చలాన్లు, బాధితుల ఆక్రోశాలు, వారి శాపనార్థాలు, మీడియా డిబేట్లు... ఏదో చేయడం లేదన్న విమర్శలు ఉండవు. అసలు ఇంతమంది 138 కోట్లమంది జనాభాకు ఎవరు మాత్రం ఏం చేయగలరు?

అందుకే, గోమూత్రం ద్వారా కరోనా కట్టడి ఆలోచనను ప్రమోట్ చేయడం ద్వారా –సైన్సునే నమ్ముకున్న దేశాలను ఆవు పేడ పెట్టి కొట్టినట్టు ఉంటుంది. పై పెచ్చు, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి- మొహం మీద గుద్దినట్టు చెప్పవచ్చు.మనం ప్రయత్నిస్తే 'అంతర్జాతీయ మూత్ర దినం' అంటూ ఒక రోజును ఐక్యరాజ్య సమితి చేత ప్రకటింపచేయవచ్చు. కేవలం సైన్స్‌ను మాత్రమే నమ్ముకోవాలన్న మూఢ నమ్మకాన్ని పటా పంచలు చేయవచ్చు.పైగా వచ్చే ఏడాది జరగవలసి ఉన్న ఏడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తం కావడానికి కావలసినంత సమయం, వెసులుబాటు దొరుకుతుందని మనవి. ఆపైన ఏలిన వారి చిత్తం.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

## గూడూరు డివిజన్ వార్తలు

## 15 లక్షలతో ఉచిత కరోనా కిట్లు

- **పిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ**
- **మంత్రులు అనిల్, గౌతమ్‌రెడ్డి**



కరోనా పాజిటివ్‌తో హోం ఐసోలేషన్, క్వారంటైన్‌లలో చికిత్స పొందుతున్న వారికి జిల్లాలోనే భారీ ఎత్తున రూ.15 లక్షల వ్యయంతో మెడికల్ కిట్‌లను ఉచితంగా అందజేసేందుకు పి.ఎస్.ఆర్ ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీయమని మంత్రులు డా. అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతంరెడ్డి అన్నారు. ఈనెల 17న గూడూరు మండల పరిధిలోని చెన్నూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంత్రుల చేతుల మీదుగా ట్రస్ట్ ప్రతినిధి పొణకా దివ్యతేజరెడ్డి ఆధ్వర్యంలో పేదలకు ఉచిత మెడికల్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పొణకా దేవసేనమ్మ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలో కూడా సొంత నిధులు వెచ్చించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. కష్టకాలంలో కరోనా బాధితులను ఆదుకునేందుకు ముందుకొచ్చిన ప్రముఖ పారిశ్రామికవేత్త పొణకా శివకుమార్‌రెడ్డి, పొణకా దేవసేనమ్మలకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు, గూడూరు సబ్‌కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, వైసిపి నాయకులు చేవూరు విజయమోహన్‌రెడ్డి, మల్లు విజయ్ కుమార్‌రెడ్డి, నాసిన నాగులు, శ్రీకిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ముప్పాల చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కనుమూరు దాతృత్వం



- **ఆక్సిజన్ ప్లాంటుకు 6 లక్షలు,**
- **200 సిలిండర్లకు లక్షరూపాయలు**

చిల్లకూరు మండలం బూదనం గ్రామంలో గత పదేళ్ళుగా మూతపడి ఉన్న శ్రీకృష్ణతేజ ఎయిర్ ప్రొడక్ట్స్ ఏఎస్‌యూ(ఎయిర్ సూప్రిస్ యూనిట్) ప్లాంటును పున:ప్రారంభించేందుకు కనుమూరు హరిశ్చంద్రారెడ్డి 6 లక్షల రూపాయలు అందించారు. అలాగే గూడూరు ఏరియా ఆసుపత్రికి 200 సిలిండర్‌లకు లక్ష రూపాయల విరాళాన్ని ఆయన జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ప్లాంటు యజమాని లేఖరాజు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఈ ప్లాంట్ ద్వారా బాధితులకు అత్యవసరమైన ప్రాణవాయువు అందిస్తున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన హరిశ్చంద్రారెడ్డికి జిల్లా కలెక్టర్ చక్రదర్‌బాబు, గూడూరు సబ్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణలకు ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీకృష్ణ సేవాసమితి..అన్నదానం



గూడూరు గమళ్ల పాలెంలో ఉన్న ఓం సాయిరాం చారిటబుల్ ట్రస్ట్‌లో శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు, విజయవాడ రైల్వే డివిజన్ డిఆర్‌యుసిసి మెంబర్ డాక్టర్ బి. శ్యామ్‌సుందరరావు (మయూరి శ్యామ్) ఆధ్వర్యంలో నెల 18న 40 మంది వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెలలో ఒకరోజు వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మయూరి స్వీట్స్ అండ్ బేకరీ, వనజాకృష్ణ కళ్యాణ మండపం వారి సహకారంతో అన్నదానం చేపట్టారు.

# నేతన్నల వెతలు..తీరేదెన్నడో!

- కష్టాల కలనేతగా మారిన నేత బతుకులు
- కోవిడ్ సంక్షోభంలో చేనేత పరిశ్రమ



***కరోనా సంక్షోభంతో చేనేత పరిశ్రమ చితికిపోతోంది. నేత కారుల బతుకులు అల్లకల్లోలంగా మారాయి. ఎంతో నాణ్యమైన నేతవస్త్రాలు చేసేవారి జీవితాలు ఇపుడు కష్టాల కలనేతగా మారిపోయాయి. నెలంతా మగ్గం నేస్తే తప్ప కనీసం కుటుంబ పోషణకు వచ్చేది పదివేల రూపాయల లోపే. అయినా పనులు లేకపోవడంతో అది కూడా ఇప్పుడు లభించడం లేదు. దీంతో నేత పని తప్ప మరే పని తెలియని ఎంతోమంది నిరుపేద నేతన్నలు జీవనోపాధి కోల్పోయి నానా అవస్థలు పడుతున్నారు.***

తొలిదశ కరోనాను ఎలాగో ఎదుర్కొని జీవితాలు సాగిస్తున్న ఈ కష్టజీవులు, ఇప్పుడు రెండోదశ కరోనాతో వణికిపోతున్నారు. నేసిన వస్త్రాలను అమ్ముకునే పరిస్థితి లేక, జీవనాధారం లేక వారు పడే బాధలు వర్ణనాతీతం. జిల్లాలో సుమారు ఏడువేల దాకా చేనేత మగ్గాలున్నాయి. దాదాపు పదివేల మంది మగ్గాలమీదే ఆధారపడి జీవిస్తున్నారు. ఇదే వృత్తి చేసుకుని బతికేవారు 40 వేల మందిదాకా, వీరిని ఆసరాగా చేసుకుని బతికే అనుబంధ వృత్తుల వాళ్ళు మరో 30 వేల మందికి పైగానే ఉన్నారు. అంతా కలిసి దాదాపు లక్షమందికి పైగానే నేతకారులు జిల్లాలో ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా వెంకటగిరి, బంగారుపాళెం తదితర ప్రాంతాల్లో జరీచీరలు, పట్టుచీరలు ఎంతో నాణ్యతతో, నైపుణ్యంతో చేసే నేతకారులు పెద్దసంఖ్యలో ఉన్నారు. వంశపారంపర్యంగా వాళ్ళది అదే వృత్తి కూడా. ఇక ఇతరత్రా పనులు వాళ్లకి తెలియదు. ఇప్పటికే లక్షలాది రూపాయల విలువ జేసే చీరలు, వస్త్రాలు అన్నీ అంగళ్ళలోనే మూలుగుతున్నాయి. ఒకవైపు లాక్‌డౌన్‌లు, మరోవైపు కర్ఫ్యూ ఆంక్షలు వగైరాలన్నీ కలసి వాటి ప్రభావం దుకాణాలపై పడడంతో చేనేత వస్త్రాల కోసం దుకాణాలకు వచ్చేవారి సంఖ్య బాగా తగ్గిపోయిందని వ్యాపారులు లబోదిబోమంటున్నారు. మరోవైపు ముడిసరుకులు తీసుకువచ్చేందుకు రవాణా సౌకర్యాలు లేకపోవడంతో మగ్గాల్లో నేస్తున్న వస్త్రాలు ఎక్కడివక్కడే అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో కొత్తగా వస్త్రాలు నేయించేందుకు వ్యాపారులు వెనుకంజ వేస్తున్నారు. ముడిసరుకుల ధరలు ఆకాశానికంటాయి. ఇన్ని కష్టాలూ పడి ఒకవేళ వస్త్రాలు నేసినా ప్రస్తుత పరిస్థితుల్లో అసలు గిట్టుబాటు ధరలు కూడా లేక, నేతపనులన్నీ ఆగిపోయి వ్యాపారులు అష్టకష్టాల్లో ఉన్నారు. చివరికి ఇళ్ళ బాడుగలు, ఇతరత్రా కుటుంబ ఖర్చులు భరించలేక వారి వద్ద పనిచేసే పేద చేనేతకారులు, వారి కుటుంబాలవారు లబోదిబోమంటున్నారు. అందినకాడికి అప్పులు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ కరోనా ఎప్పుడు పోతుందో, ఎప్పటికి తమ బతుకులు బాగుపడతాయోనని నేతన్నల కుటుంబాలు అల్లాడిపోతున్నాయి.

### నేతన్నలను ఆదుకోవాలి :

గత ఏడాది సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ దుస్థితినుంచి చేనేతకారులను కాపాడేందుకు 'నేతన్న నేస్తం' పథకం ద్వారా కొంతమేరకు సాయం అందించడంతో వేలాదిమంది నేతకారులు కష్టాల నుంచి బయట పడ్డారు. ఈసారి పరిస్థితి కరోనా రెండోదశ ప్రభావంతో మరింత దయనీయంగా ఉందని, నేతకారులందరినీ ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వాలు మానవతా దృక్పథంతో ముందుకు రావాలని నేతకారులు కోరుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'నేతన్న నేస్తం' పథకాన్ని ముందుగానే ప్రకటించి తమ కుటుంబాలను ఈ కష్టాల నుంచి తప్పించాలని నిరుపేద చేనేతకారులు వేడుకుంటున్నారు.

## చెంగాళ పరమేశ్వరి అమ్మవారికి..బంగారుహారం



సూళ్ళూరుపేటలో వెలసివున్న శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారికి ఇటీవల సూళ్ళూరుపేట పట్టణానికి చెందిన అమ్మవారి భక్తుడు, దాత ఏ.సాగర్‌రెడ్డి 61 గ్రాముల బంగారుహారాన్ని సమర్పించుకుని తన భక్తిని చాటుకున్నాడు. ఈ సందర్భంగా ఆలయ ఇ.ఓ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి, ఆలయ అర్చకులు దాతను స్వాగతించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి ఆశీస్సులు అందజేశారు.

'కోవిషీల్డ్' రెండో డోసుకు..

# 16 వారాల వ్యవధి

డిఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్

కోవిషీల్డ్ టీకా మొదటి డోసు వేయించుకున్న తర్వాత రెండో డోసు వేయించుకునే వ్యవధిని ప్రభుత్వ ఆదేశాల మేరకు 12 నుంచి 16 వారాలకు పెంచడం జరిగిందని ఇన్‌చార్జి డిఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టీకా వేయించుకున్నవారికి మొదట్లో 6 నుంచి 8 వారాల వ్యవధిలో రెండో డోసు వేయడం జరిగేదని, తాజాగా నేషనల్ టెక్నికల్ అడ్వయిజరీ గ్రూపు అధ్యయనాల ప్రకారం ఈ వ్యాక్సిన్ వ్యవధిని ఇప్పుడు పెంచడం జరిగిందని ఆయన వివరించారు. ఇప్పటికే మొదటి డోసు టీకా వేయించుకున్నవారికి 12 వారాల తర్వాతనే రెండో డోసు టీకా వేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. అయితే కోవాగ్జిన్ టీకా వ్యవధిని మాత్రం పెంచలేదని, కోవాగ్జిన్ వేసుకున్నవారు నాలుగు వారాల తర్వాత రెండో డోసు వేయించుకోవాలని ఆయన సూచించారు.

## కోవిడ్ లక్షణాలున్నవారికి.. మందులు సిద్ధం

డిపిఓ ధనలక్ష్మి



కోవిడ్ వైరస్ నిర్ధారణ కాకపోయినా ఆ వైరస్ లక్షణా లున్నవారికి అవసరమైన మందుల కిట్‌లను అందజేస్తున్నామని, ఇప్పటివరకు జిల్లాలో సుమారు 53 వేల మందికి ఈ మందులు అందజేశామని జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మి తెలిపారు. కరోనా వ్యాధి నిర్ధారణ అయినవారు ఇళ్ళల్లో ఉండేందుకు వసతి లేకపోతే వెంటనే కోవిడ్ కేర్‌సెంటర్‌లలో చేరాలని ఆమె సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కోవిడ్ కేసులు పెరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వైరస్ సోకిన ప్రాంతాలను గుర్తించి కంటైన్మెంట్ చేయడంతో పాటు, ఆ ప్రాంతాలను శానిటైజ్ చేయించాలని ఆమె సిబ్బందికి సూచించారు.

## కబడ్డీ క్రీడాకారుడు సుందరరాజా మృతి



జిల్లాలో తొలి కబడ్డీ క్రీడా జట్టులో రాణించిన కోవూరు క్రీడాకారుడు తువ్వర సుందరరాజా ఇటీవల గుండెపోటుతో మరణించారు. 1968 నుంచి 1977 దాకా రాష్ట్రస్థాయిలో జరిగిన అనేక కబడ్డీ క్రీడల పోటీల్లో జిల్లా జట్టుకు ఆయన ప్రాతినిధ్యం వహించడమే కాక, జిల్లాలో కబడ్డీ అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని, ఆయన మృతి క్రీడారంగానికి తీరని లోటని స్థానిక క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కోవూరు పంచాయతీలో వార్డు సభ్యునిగా కూడా ఆయన పనిచేసి ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్నారని గుర్తుకు తెచ్చుకుంటూ ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ఆధ్యాత్మికత వెల్లివిరిసే.. గూడూరు సాయిబాబా దేవాలయం

***సర్వమత సమానత్వాన్ని బోధిస్తూ, మానవసేవే మాధవసేవ అని ప్రబోధిస్తూ, అందరినీ తన కరుణామయ దృక్కులతో అనుగ్రహిస్తూ.. కోట్లాదిమంది భక్తులకు ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మహామహిమాన్విత స్వరూపుడు.. దయామయుడు శ్రీ షిరిడీ సాయినాథుని మందిరాలు దేశవ్యాప్తంగా ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లాలో కూడా అనేకప్రాంతాల్లో అత్యద్భుతమైన షిరిడీ సాయిబాబా మందిరాలెన్నో ఉన్నాయి. అలాంటి విశిష్టమైన ఆలయాల్లో భక్తుల కొంగుబంగారంగా నిలిచిన ఆలయం.. గూడూరులోని శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయం.***

షిరిడీలో వెలసి మానవాళిని తన మహోన్నతమైన బోధనలతో తరింపజేసిన అవతారమూర్తి శ్రీ షిరిడీ సాయిదేవుని పట్ల అపారమైన భక్తివిశ్వాసాలతో ప్రజలు శ్రీసాయినాథునికి ఆలయం నిర్మించుకుని ఎంతోకాలంగా ఆరాధిస్తున్నారు. విశ్వప్రేమను చాటిన దత్తావతార స్వరూపుడు.. సద్గురుదేవుడైన శ్రీ సాయినాథుని సేవలో అనునిత్యం తరిస్తున్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని గూడూరులో నెలకొల్పబడివున్న ఈ ఆలయం దేదీప్యమానంగా వెలుగొందుతూ సాయి భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటూ ఉంది. ఈ ఆలయ ఆవిర్భావానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

### ఆలయ చరిత్ర :

గూడూరు పట్టణంలోని అనేకమంది సాయిభక్తులు 1982 ప్రాంతంలో సత్సంగాలు నిర్వహించుకుంటూ, అక్కడే సాయినాథుని చిత్రపటానికి పూజలు చేసుకుంటూ ఉండేవారు. ఆ తర్వాత 1986లో వారు షిరిడీకి వెళ్ళి శ్రీ సాయినాథుని ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆ సమయంలో అక్కడున్న ఒక స్వామీజీని కలిసి గూడూరులోనూ శ్రీ సాయిబాబా మందిరాన్ని నెలకొల్పాలనే తమ కోరికను వెల్లడించగా ఆ స్వామీజీ ఒక టెంకాయను,








మన దేవాలయాలు 48

బాబా పాదస్పర్శ కలిగిన రాళ్ళను ఇచ్చి ఆశీర్వదించారని, ఆ భక్తులంతా తిరిగి గూడూరుకు రాగానే బాబా పట్ల వారికి ఉన్న భక్తిని చూసి ఒక దాత వెంటనే స్పందించి గూడూరులోని ఆర్టీసి డిపో సమీపంలో సాయినాథుని ఆలయనిర్మాణానికి కొంతస్థలాన్ని ఇచ్చాడని అంటారు. శ్రీ సాయినాథుని అనుగ్రహంతోనే ఇదంతా జరిగిందని భక్తులు ఆనందిస్తూ ఆ స్థలంలో బాబా చిత్తరువుకు పూజలు చేస్తూ సత్సంగాలు నిర్వహించడం ప్రారంభించారు. కొంతకాలం గడిచాక సాయిభక్తుల సంఖ్య క్రమేణా పెరగడంతో 1987 ప్రాంతంలో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. స్వర్ణవర్ణ గోపురంతో నగిషీలు దిద్దిన శిల్పాకృతులతో ఆలయాన్ని అత్యంత శోభాయమానంగా తీర్చిదిద్దారు. చుట్టూ పచ్చని చెట్లతో, సుప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంతో సర్వాంగ సుందరంగా ఆలయ నిర్మాణం జరిగింది. 1991లో గురుపూర్ణిమ రోజున శ్రీ సాయినాథుని విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. అందులోనూ, మహారాష్ట్రలోని పండరిపురం క్షేత్రంలో అద్వితీయమైన రీతిలో రూపుదిద్దుకున్న శ్రీ బాబావారి దివ్యమంగళ విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించడం ఎంతో విశేషం. షిరిడీలో శ్రీసాయినాథుడు ఆశీనులై ఉన్న రీతిలోనే ఇక్కడ కూడా అదే విధంగా శ్రీ సాయినాథుని విగ్రహమూర్తిని ప్రతిష్ఠించడంతో భక్తుల ఆనందానికి అవధుల్లేవు. నాటి నుంచి నేటికీ ఆ అపురూపమైన ఆలయంలో మరింత భక్తితో నిరంతరం సాయినాథునికి పూజలు, హారతులు, సేవలు చేస్తూనే ఉన్నారు.

### అఖండంగా వెలిగే.. నంద దీపం :

గూడూరు శ్రీ షిరిడీసాయి బాబా మందిరంలో అనేక ప్రత్యేకతలున్నాయి. ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక మందిరంలో నంద దీపం అఖండంగా వెలుగొందుతూ ఉంటుంది. అఖండ జ్యోతి, నందజ్యోతి, ఓంకార మందిరాలు ఈ ఆలయంలో ప్రత్యేకత సంతరించుకుంటూ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఎల్లవేళలా 'ఓం సాయి, శ్రీ సాయి ..జయజయ సాయి'..అంటూ శ్రీసాయినాథుని నామస్మరణలతో మార్మోగుతూ ఉండే ఈ ఆలయం సాయిబాబా కీర్తనలు, భజనలతో అలరారుతూ ఉంటుంది. అవతార స్వరూపుడు, భక్తవరదుడు అయిన శ్రీ సాయినాథుని కరుణ ఉంటే ఎంతటి కష్టాలైన కరిగిపోతాయని, జీవితాలు శుభప్రదంగా సాగుతాయని భక్తుల విశ్వాసం. ఈ ఆలయ ప్రాంగణంలోనే పరమశివుడు, ఆంజనేయస్వామి, విఘ్నేశ్వరుడు, దత్తాత్రేయస్వామి వార్ల ఉపాలయాలు కూడా ఆలయం ప్రాంగణంలో ఉండడంతో శ్రీ సాయినాథుని దివ్య మందిరం సకల దేవతల మందిరంగా ఉంటూ అందరినీ ఆకట్టుకుంటూ ఉంది. ఈ ప్రత్యేక మందిరాల్లోనూ స్వామివార్లకు అనునిత్యం విశేష పూజలు, సేవలు చేస్తున్నారు. ప్రతిఏటా గురుపూర్ణిమ వేడుకలు, దత్తజయంతి, వినాయకచవితి, శ్రీరామనవమి, హనుమజయంతి తదితర ఉత్సవాలను కూడా ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు.

## సీనియర్ పాత్రికేయుడు

# ముత్యాల సుందరరామ్ మృతి

### ఒకే కుటుంబంలో ముగ్గురు కరోనాకు బలి



నెల్లూరు పత్రికా రంగంలో అందరికీ సుపరిచితమైన సీనియర్ పాత్రికేయుడు, 'వార్త' పత్రికలో సాంస్కృతిక విలేకరిగా పనిచేస్తున్న ముత్యాల సుందరరామ్ ఈనెల 16వ తేదిన కరోనా బారినపడి కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండు వారాల క్రితం ఆయనకు కరోనా సోకినట్లు నిర్ధారణ కావడంతో నగరంలోని పలు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందారు. కరోనాతో పోరాడుతూనే చివరికి మృతిచెందారు. ఆయన మరణం పాత్రికేయ రంగాన్ని ఆవేదనకు గురిచేసింది. తొలి విడత కరోనాలో ఆయన తమ్ముడు జర్నలిస్టు మూర్తిని, వీరి మాతృమూర్తిని కూడా కరోనా బలితీసుకుంది. ఇలా.. ఒకే కుటుంబంలో తమ్ముడు, అమ్మ, అన్న ముగ్గురూ మృత్యువాత పడడంతో ఆ కుటుంబం విలవిలలాడిపోతోంది. ప్రత్యేక వార్తా కథనాలతో ఆయన కళా సాహిత్యరంగాల్లో తనకంటూ మంచి గుర్తింపును తెచ్చుకున్న సుందరం మృతి ఎంతో బాధాకరమని నగరంలోని అనేక మంది ప్రముఖులు, సారస్వతాభిమానులు, కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడూ విసుగనేది లేకుండా చిరునవ్వుతోనే అందరినీ పలకరించేవారు. నిజాయితీ, నిబద్ధత కలిగిన పాత్రికేయుడాయన. ఆయన మరణం బాధాకరం. పాత్రికేయరంగానికి తీరని లోటు. సౌమ్యుడు, స్నేహపాత్రుడు, సహృదయ పాత్రికేయుడైన సుందరం మృతికి విచారం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలుపుతోంది.. 'లాయర్'!...

# పెద్దదిక్కును కోల్పోయాం

**- ఎంపి వేమిరెడ్డి ఆవేదన**



సీనియర్ నేత కాకాణి రమణారెడ్డి మృతితో జిల్లా ఒక పెద్దదిక్కును కోల్పోయినట్లయిందని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 15న ఆయన పొదలకూరు మండలం తోడేరులోని వారి నివాసానికి వెళ్ళి కాకాణి రమణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. తండ్రి మృతిని జీర్ణించుకోలేక ఆవేదనలో ఉన్న రమణారెడ్డి కుమారుడు, సర్వేపల్లి శాసనసభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఓదార్చారు. కాకాణి కుటుంబసభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నానని అన్నారు.

# మహోన్నత వ్యక్తి.. కాకాణి రమణారెడ్డి

**- ఎమ్మెల్యే ఆనం నివాళి**



సీనియర్ నేత, మహోన్నత వ్యక్తి కాకాణి రమణారెడ్డి అని, ఆయన అందరికీ ఆదర్శప్రాయులని వెంకటగిరి ఎమ్మెల్యే, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. పొదలకూరు మండలంలోని తోడేరు గ్రామంలో ఈనెల 19న కాకాణి నివాసం వద్ద జరిగిన కాకాణి రమణారెడ్డి ఉత్తరక్రియల్లో ఆనం పాల్గొని ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకాణి రమణారెడ్డి నిబద్ధత, ప్రజాసేవాతత్వాన్ని గురించి ఆయన వివరిస్తూ నెల్లూరుజిల్లా పాతతరం రాజకీయాలను శాసించిన ప్రత్యేక తరహా ప్రజానాయకునిగా, తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించేవరకు విశ్రమించని యోధునిగా, మడమ తిప్పని నేతగా, నాటి స్వర్గీయ ఏసి సుబ్బారెడ్డి మొదలుకుని నేడు తనవరకు ఆనం కుటుంబంతో అత్యంత ఆత్మీయ, రాజకీయబంధంతో ముడిపడి రమణారెడ్డి తన ప్రజాజీవితాన్ని సాగించారని తెలిపారు. పొదలకూరు – రాపూరు ప్రాంత ప్రజలందరిచేత 'పెద్దాయన'గా ప్రేమపూర్వకంగా పిలవబడే ముక్కుసూటి నేత, మాజీ సమితి అధ్యక్షులు, నెల్లూరుజిల్లా సీనియర్ నాయకులు, సర్వేపల్లి శాసనసభ్యులు –ఏపి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి తండ్రిగారైన ..కాకాణి రమణారెడ్డి మృతి జిల్లా రాజకీయ రంగానికి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## మృదు భాషి - స్నేహాభిలాషి


# తులసీరామ్‌రెడ్డి ఇక లేరు



గునపాటి తులసీరామ్‌రెడ్డి మే 15వతేదీ శనివారం నాడు తమ 64వ ఏట కాలం చేశారు. తులసి అని ఆయన మిత్రులు, సహచరులు ఆప్యాయంగా పిలుచుకునే తులసిరామ్‌రెడ్డి కబడ్డీ క్రీడాకారుడు కూడా. 1970వ దశకంలో విద్యార్థి నాయకుడిగా ఆయన పేరు జిల్లా అంతటా మారుమ్రోగింది. రాజకీయ నాయకుల ఎన్నికలను తలపించే విధంగా జరిగిన ఎన్నికలలో 1977లో ఆయన వి.ఆర్ కాలేజీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తులసీరామ్‌రెడ్డికి చదువుకునే రోజులనుండి సేవాభిలాష ఎక్కువ. నిస్వార్థంగా తన సేవలు అందించి విద్యార్థి నాయకుడిగా మంచి పేరు పొందారు.

క్రికెట్ అన్నా, కబడ్డీ అన్నా ఆయనకు మక్కువ ఎక్కువ. వీటన్నింటి కన్నా స్నేహితులంటే పిచ్చి. కబడ్డీ క్రీడాకారుడిగా, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కబడ్డీ క్రీడకు ఎంతో ప్రోత్సాహం అందించారు. కాలేజీ రోజులను స్ఫూర్తిగా తీసుకుని ఇప్పటికీ రాజకీయ రంగంలో తన ఉనికిని చాటుతూనే ఉన్నారు. ఆయన స్వగ్రామం లేగుంటపాడు వేదికగా క్రియాశీలక రాజకీయాలలో తులసీరామ్‌రెడ్డి చురుగ్గా పాల్గొనేవారు. ఆయన వైసిపి నాయకునిగా పేరొందారు.

స్వార్ధ రాజకీయాలతో, ఆధిపత్య పోరుతో భ్రష్టు పట్టిపోయిన వి.ఆర్ కాలేజీకి పూర్వ వైభవం తేవాలని తులసీరాంరెడ్డి తపించేవారు. మృదుభాషి, స్నేహాభిలాషి, సేవాభిలాషి, సౌమ్యుడు అయిన తమ మిత్రుడిని కోల్పోవడంతో ఆయన సహ విద్యార్థులు విషాదంలో మునిగిపోయారు.



విద్యార్థి నాయకుడిగా తులసి

తుసీరామ్‌రెడ్డి మృతిని జీర్ణించుకోలేక పోతున్నామని అయన స్వగ్రామంలోని స్థానిక నాయకులు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాడ సానుభూతిని తెలుపుతోంది లాయర్.

### కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న సంతాపం :

తులసీరామ్‌రెడ్డి తనకెంతో ఆత్మీయుడని, ఆయన అకాల మరణం తననెంతగానో బాధించిందంటూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అటు కబడ్డీ క్రీడకు, ఇటు గ్రామాభివృద్ధికి ఆయనెంతగానో కృషిచేశారని కొనియాడారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డితో పాటు వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు, నాయకులు, పలువురు విఆర్ కళాశాల పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు తులసీరాంరెడ్డి ఆప్తులు ఆత్మీయులు ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.

## ఆరునెలల పసిబిడ్డ చికిత్సకోసం..

# ప్రసన్న 2 లక్షల విరాళం



గుండెలో రంధ్రం పడి గుండెజబ్బుతో బాధపడుతున్న ఓ చిన్నారికి కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న ఆపన్నహస్తం అందించారు. ఆ చిన్నారి వైద్యం కోసం తనవంతు సేవలందిస్తున్నారు. కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం మండలం వడ్డిపాళెంలో ఉన్న ఓ ఆరునెలల చిన్నారి గుండెజబ్బుతో బాధపడుతుంటే ఆ చిన్నారి వైద్యం కోసం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, తన తండ్రి దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్‌ట్రస్ట్ ద్వారా రెండు లక్షల రూపాయలు విరాళం ప్రకటించి తన మానవీయ సేవలను మరోసారి చాటుకున్నారు. వడ్డిపాళెంలోని షణ్ముఖ అభిరామ్ అనే ఆరేళ్ళ చిన్నారికి గుండెలో రంధ్రం పడి బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రసన్న వెంటనే స్పందించి ఆ విరాళం అందించారు. అంతేకాక, నెల్లూరులోని గుండెవ్యాధి నివారణ నిపుణులను సంప్రదించి, ముఖ్యమంత్రి సహాయ నిధితో ఆ చిన్నారికి శస్త్రచికిత్సలకు కూడా సహకారమందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోడూరు మధుసూదన్‌రెడ్డి, బుచ్చి నగర కమిషనర్ వి.శ్రీనివాసరావు, ఎంపిడిఓ నర్శింహారావు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల ప్రాణాలు కాపాడండి

ఆసుపత్రుల్లో ఆక్సిజన్ కొరత లేకుండా చూడాలని, కరోనా బాధితుల ప్రాణాలు కాపాడేందుకు మెరుగైన వైద్యం అందించాలని బిజెపి జిల్లా నాయకుడు బి.శ్రీనివాసులు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆయన మనుబోలులో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలోని ఆసుపత్రుల్లో పడకల వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని, అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కరోనా బాధితులకు అవసరమైన ఆక్సిజన్ కొరత లేకుండా చూడాలని కోరారు.

## పాతతరం పెద్దాయన

# టంగుటూరు కృష్ణారెడ్డి కన్నుమూత



పాతతరం పెద్దల్లో ప్రముఖులు, స్నేహశీలి, మృధుస్వభావి టంగుటూరు కృష్ణారెడ్డి తమ 89వ ఏట మే16 ఆదివారం తుది శ్వాస విడిచారు. వయోభారంతో పాటు వచ్చిన అనారోగ్యంతో ఆయన గత కొంత కాలంగా బాధపడుతున్నారు. కిష్టయ్యగా ఆయన సమకాలీకులు, మిత్రులు ఆప్యాయంగా పిలుచుకునే కృష్ణారెడ్డి స్వగ్రామం నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం కుడితిపాళెం కాగా ఆయన తోటపల్లిగూడూరు మండలం పోట్లపూడికి దత్తత వచ్చారు. దాదాపు 3దశాబ్దాల పాటు ఆయన పోట్లపూడి గ్రామ సర్పంచ్‌గా పనిచేయడంతో పాటు సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గ రాజకీయాలలో ముఖ్య భూమిక పోషించారు. ఆదర్శ రైతుగా కూడా కృష్ణారెడ్డికి మంచి పేరుంది. బెజవాడ గోపాలరెడ్డి ఎన్నికలలో పోటీ చేసిన సందర్భాలలో జమ ఖర్చులన్నీ కృష్ణారెడ్డి చూసేవారు.

మృదుభాషైన కృష్ణారెడ్డికి స్నేహితులంటే ప్రాణం. ఆతిధ్యం ఇవ్వాలంటే చాలా ఇష్టం. స్నేహితులలో ఆత్మీయతను చూసేవారు తప్ప వయసు చూసేవారు కాదు. వ్యక్తులలో కూడా ఆయనకు పేదా గొప్ప అన్న తేడా లేదు అందరిని సమానంగా చూడడం ఆయన నైజం. ఆనం భక్తవత్సలరెడ్డి కృష్ణారెడ్డికి ప్రాణ స్నేహితుడు. భక్తవత్సలరెడ్డి చివరిశ్వాస వరకు వీళ్లిద్దరు నిత్యం కలుసుకుని కష్టసుఖాలు చెప్పుకునేవారు. ఒక విధంగా భక్తవత్సలరెడ్డి మరణం కృష్ణారెడ్డిని బాగా కుంగదీసిందని చెప్పవచ్చు.

రేబాల దశరథరామిరెడ్డికి కృష్ణారెడ్డి స్వయానా మేనల్లుడు. రేబాల లక్ష్మీనరసారెడ్డికి కూడా అతి దగ్గర బంధువు. తన వ్యక్తిగత వ్యవహారాలలోను ఆర్థిక లావాదేవీల విషయాలలోనూ అత్యంత నమ్మకమైన వ్యక్తిగా కృష్ణారెడ్డిని ఆర్‌యల్‌రెడ్డి గౌరవించేవారు. తిక్కవరపు బలరామిరెడ్డి, జె.వి.రెడ్డి వంటి వారితో పాటు, నెల్లూరుజిల్లాకు చెందిన అనేక ఉన్నత కుటుంబాలతో కృష్ణారెడ్డికి మంచి బంధుత్వాలు ఉన్నాయి. కృష్ణారెడ్డికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. ఆనందమయమైన, పరిపూర్ణ జీవితం గడిపి దైవ సాన్నిధ్యం పొందిన కృష్ణారెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

### విక్రమసింహపురి యూనివర్శిటి

# వీసీ సుదర్శనరావు తొలగింపు

## ఇన్‌చార్జిగా రాజశేఖర్

యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) నిబంధనలకు విరుద్ధంగా నియమితులైన నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్శిటీ వీసీ సుదర్శనరావును ఆ స్థానం నుంచి తప్పిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేయడంతో యూనివర్శిటీ వర్గాల్లో కలకలం చెలరేగింది. వైస్‌చాన్సలర్ నియామకం కోసం ఏర్పాటయ్యే సెర్చి కమిటీలో ఆయా విశ్వవిద్యాలయాలతో సంబంధం ఉన్న వ్యక్తులు సభ్యులుగా ఉండ కూడదనేది యుజిసి నిబంధన. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు 2018, 19ల్లో చేపట్టిన వైస్‌చాన్సలర్ నియామకాల కోసం ఏర్పాటైన సెర్చి కమిటీల్లో ప్రభుత్వ ప్రతినిధిగా ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, లేదా ముఖ్య కార్యదర్శులను నియమించారు. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి రాష్ట్రంలోని అన్ని యూనివర్శిటీల పాలక మండలిలో సభ్యులుగా ఉంటారు. ఇలా పాలకమండలిలో సభ్యులైన వ్యక్తుల్ని వైస్ చాన్సలర్ నియామకపు సెర్చి కమిటీలో చేర్చడం అభ్యంతరకరమని కాకినాడలో జెఎన్‌టియు వైస్ చాన్సలర్ నియామకాన్ని రద్దుచేయాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖ లైంది. దానిపై తీర్పు చెప్పిన కోర్టు ఆ నియామకాన్ని రద్దు చేయాలని ఆదేశించింది. యుజిసి నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేపట్టవద్దని హితవు పలికింది. నెల్లూరులోని విక్రమసింహపురి యూని వర్శిటీ వైస్ ఛాన్సలర్ నియామకంలో కూడా



ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్‌ను అభినందిస్తున్న రిజిస్ట్రార్ డా. ఎల్.వి.కె.రెడ్డి

యుజిసి నిబంధనలు పాటించని విషయాన్ని తెలియజేస్తూ ఉన్నత విద్యాశాఖ రాష్ట్ర గవర్నర్, యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌కు ఫైలు పంపింది. గవర్నర్ దానిని పరిశీలించి సుదర్శనరావు నియామకాన్ని రద్దు చేయాల్సిందిగా ఆదేశించడంతో ఆ మేరకు ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీచేసింది. 2018 జులై 25వ తేదీన సుదర్శనరావు వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టారు. మామూలుగా అయితే ఆయన ఈ ఏడాది జులై 24వ తేదిన పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఇప్పుడు సుదర్శనరావు స్థానంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్‌ను ఇన్‌చార్జిగా నియమిస్తూ కోర్టు మరో ఉత్తర్వును జారీ చేయడంతో రాజశేఖర్ వెంటనే ఆ బాధ్యతలు చేపట్టారు.

# కరోనాతో.. జర్నలిస్టుల మృతి బాధాకరం

## మాజీమంత్రి సోమిరెడ్డి ఆవేదన

జిల్లాలో కరోనా వ్యాధితో పలువురు జర్నలిస్టులు మృతిచెందడం బాధాకరమని మాజీమంత్రి, టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఇటీవల సీనియర్ జర్నలిస్టు 'వార్త' పాత్రికేయుడు సుందరం చనిపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఎన్నో కష్టనష్టాలకు ఎదురొడ్డి ప్రజలకోసం పనిచేసే జర్నలిస్టు సోదరులను ఒక్కొక్కరిగా కోల్పోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని, గత ఏడాది సుందరం సోదరుడు జర్నలిస్టు మూర్తిని బలితీసుకున్న కరోనా ఇపుడు ఆయన్ని కూడా తీసుకెళ్లిపోవడం మరెంతో బాధ కలిగిస్తోందని అన్నారు. సుందరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సమాజ హితంకోసం పనిచేసే జర్నలిస్టులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కరోనా బారిన పడిన జర్నలిస్టులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులను వెంటనే ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ప్రకటించి చనిపోయిన వారి కుటుంబాలకు రూ.50 లక్షలు ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# బాలలను పనిలో పెట్టుకోవడం నేరం

## – గూడూరు సిఐ.దశరథరామయ్య

చిన్న పిల్లలను, 14 ఏళ్ళలోపు బాలలను దుకాణాలు, వాణిజ్య కార్యకలాపాల్లో పనులకు నియమించుకోరాదని, ఎవరైనా ఈ నిబంధనలను అతిక్రమిస్తే ఆ యజమానులపై బాలకార్మిక చట్టం కింద చర్యలు తీసుకుంటామని గుడూరు పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.దశరథరామయ్య హెచ్చరించారు. గూడూరు పట్టణంలో కూరగాయల మార్కెట్‌లోను, పలు వాణిజ్య ప్రాంతాల్లో తనిఖీలు చేసిన ఆయన కూరగాయల మార్కెట్‌లో ఒక చిన్న పిల్లవాడు ఉండడం చూసి ఆ దుకాణ యజమానికి కౌన్సిలింగ్ ఇచ్చారు, చిన్నపిల్లలను



పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. చిన్న పిల్లలను తప్పనిసరిగా చదివించుకోవాలని ఆయన ఈ సందర్భంగా తల్లిదండ్రులును కోరారు.

# ప్రిన్సిపాల్ మృతికి సంతాపం



గూడూరు డిఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమలసాయి ఈనెల 17న మృతిచెందారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది విచారం వ్యక్తం చేస్తూ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ సిఆర్ రెడ్డి, ప్రెసిడెంట్ రవికుమార్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మెహర్మణి, పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ పి.రోహిణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విజయకర్ తదితరులు పాల్గొన్నారు.


## కమలసాయి మృతి తీరని లోటు..

గూడూరు పట్టణంలోని డి.ఆర్.డబ్ల్యు కళాశాలలో గత 30 సంవత్సరాలుగా హిందీ లెక్చరర్‌గా పని చేసి, ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కమలసాయి మృతి తీరని లోటని కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు యలవర్తి విద్యాసాగర్ అన్నారు. ఈనెల 17న పట్టణంలోని డి.ఆర్.డబ్ల్యు కళాశాలలో ఏర్పాటు చేసిన సంతాపసభలో ఆయన మాట్లాడుతూ నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో కోవిడ్ చికిత్స పొందుతూ కమలసాయి మృతి చెందారన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మృతి తీరని లోటని, ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేశారు.

వీక్షణం - మంజీరరెడ్డి

# సింహం @ 3468

ఓ రోజు... "మేడమ్! సింహం గడ్డి తినడం మీరెప్పుడైనా చూశారా?" అని అడిగిందో ట్రైనీ జర్నలిస్టు. ఆ అమ్మాయి భోజనం చేయాలంటే కనీసం ఎగ్ అయినా ఉండాలి. పైగా "సింహం శాకాహారం తినడమా" అని కూడా అంటుండేది. అలాంటమ్మాయి ఆ రోజు శాకాహార భోజనం చేస్తూ కనిపించింది. తన శాకాహార భోజనానికి కారణం చెబుతూ "సింహానికి జ్వరం వచ్చింది. అందుకే ఈ..." అంటూ ప్లేట్‌లో శాకాహార భోజనాన్ని చూపించింది.




ఈ రోజు టీవీలో ఓ వార్త. అందులో దృశ్యాలు చూస్తుంటే ఆ రోజు శాకాహారం తింటూ కనిపించిన మా ట్రైనీ సింహం గుర్తు వచ్చింది. ఇప్పుడు టీవీలో కనిపిస్తున్న సింహం దాదాపుగా గడచిన ఏడాదంతా వార్తల్లో వివాదాస్పదంగానో, అనుమానాస్పదంగానో ఏదో ఓ రకంగా ట్రెండింగ్‌లోనే ఉండేది. 'సింహం సింహమే' అని మీసం మెలేసుకుంటున్న వీడియోలు కొన్ని చానెళ్లలో పదే పదే ప్రసారమవుతుండేవి. అలాంటి 'సింహం' ఇప్పుడు సహాయకుడి భుజం మీద చెయ్యేసి, అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితిలో పాదం నేల మీద మోపడానికే భయపడుతూ నడుస్తోంది. అప్పట్లో కరోనా ఉన్నప్పటికీ మీసం మెలేయడానికి, రాష్ట్ర ముఖ్యమంత్రిని అనుకరిస్తూ మాట్లాడి సీన్ పండించడం కోసం తీసేసిన మాస్కును... ఇప్పుడు సగౌరవంగా ధరించి కరోనా ప్రొటోకాల్ పాటిస్తోంది సింహం. అయినా సింహం పాదాలకు ఏమైంది? పోలీసులు కొట్టారని చెప్తోంది సింహం. ఒంటి మీద గాయాలేవీ లేవని, సింహం ఆరోగ్యంగా ఉందని చెప్పింది వైద్య బృందం.

మనం గత ఏడాది జూలై తొమ్మిదో తేదీన ఇదే శీర్షికలో 'ఎండని ఏడో చేప' అని రాజు–ఏడుగురు కొడుకులు కథ చెప్పుకున్నాం. ఆనాటి ఏడో చేప ఈ ఏడాదికాలంలో జీవపరిణామ క్రమంలో జలచరం నుంచి వన్యమృగంగా మారిపోయింది. ఆధునిక సమాజంలో ఆటవిక ప్రవర్తనతో చెలరేగిపోయింది. సమాజంలో వైషమ్యాలను రెచ్చగొట్టింది. గ్లోబలైజేషన్ కాలంలో ప్రపంచం కుగ్రామంగా మారిపోయి దేశాలు దగ్గరవుతుంటే... తెలుగునాట రాజకీయ కుతంత్రం మాత్రం కులాల కుంపటిలో రోజుకొక సమిధను వేస్తూ ఆరనివ్వకుండా జాగ్రత్తపడుతోంది. ఆ కుతంత్రపు కుంపటిలో సమిధనవుతూ, ఈ క్షణంలో నిప్పు కణికలా మారినప్పటికీ, రేపటి రోజుకు భస్మమైపోతాననే ఎరుక సింహానికి లేకపోవడమే దీనంతటికీ కారణం కావచ్చు.

## నాయక్ – ఖల్‌నాయక్

ఓ దశాబ్దం కిందట ఆంధ్రరాష్ట్రంలో రెండు ప్రధాన సామాజిక వర్గాల మధ్య సన్నటి చీలిక మొదలైంది. ఐదేళ్ల కిందట అధికారంలో ఉన్న నాయకుడు అప్పటి ప్రతిపక్ష నాయకుడిని ఆడిపోసుకోవడానికి–ప్రతిపక్ష నాయకుడి సామాజిక వర్గం నుంచే ఒక బృందాన్ని సిద్ధం చేశాడు. ఆ బృందం తమ అధినాయకుడు తమకు ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగానే పూర్తి చేసింది. రెండేళ్ల కిందట రాజకీయ ముఖచిత్రమ్ మారిపోయింది. అధికారం చేతులు మారింది. ఇక తెలుగునాట ప్రతిపక్ష నాయకుడికి – అధికార పక్షాన్ని ఆడిపోసుకోవడానికి కొత్త బృందాన్ని తయారు చేసుకోవాల్సిన అవసరం ఆసన్నమైంది. ఆ సమయంలో ఓ స్వరం వినిపించింది... అప్పుడప్పుడే శృతి చేసుకుంటున్న అసమ్మతి స్వరం అది. ఆ స్వరం ఆ సమయంలో సమాజ ఆమోదాన్ని కూడా పొందింది. క్రమంగా ఆ అసమ్మతి శృతి పెరుగుతూ పోయింది. ఆ క్రమంలో సదరు గళం తనను తాను మర్చిపోయింది. తన గొంతులో ఏ రాగం పలకాలో కూడా మర్చిపోయింది. ఏం పలకకూడదో అనే విచక్షణను కూడా కోల్పోయింది. తనకు తెలియకుండానే మరొకరి యుద్ధంలో అమ్ముగా మారిన వైనాన్ని కూడా గ్రహించలేకపోయింది. ప్రతిపక్ష నాయకుడి అమ్ములపొదిలో తనలాంటి అమ్ములు చాలా ఉంటాయని కూడా గ్రహించలేని అమాయకత్వం... ఆ అమాయకత్వమే నేడు సింహం నేలమీద పాదం మోపడానికి కూడా భయపడుతున్న వైనం.


## ఎవరి యుద్ధం వారే చేయాలి

ఎప్పుడైనా... ఎక్కడైనా... ఎవరైనా... తమ యుద్ధాన్ని తామే చేయాలి. ఎవరూ మరొకరి యుద్ధాన్ని చేయకూడదు. అలాగే తమ యుద్ధాన్ని మరొకరు చేయాలని కూడా కోరుకోకూడదు. శత్రువుకి శత్రువు మిత్రుడని చాణక్యుడు చెప్పి ఉండవచ్చు కాక. క్రీస్తు పూర్వం నాటి ఆ మాట ఇప్పటికీ అనేక సందర్భాల్లో నిజం అయితే అయి ఉండి ఉండవచ్చునూ కాక. అలాగని ప్రతి సందర్భంలోనూ నిజం అయ్యే అవకాశం లేదని కూడా గ్రహించాలి. అంతకంటే ముందు తాను యుద్ధం చేస్తున్నానా, యుద్ధ సాధనంగా మారిపోతున్నానా అనే విషయంలో అప్రమత్తంగా ఉండకపోతే సింహం పరిస్థితి చిట్టెలుక కంటే దయనీయమవుతుంది. ఇప్పుడు 3468 బ్యారక్‌లో కూర్చుని ఎంత ఆలోచించినా కాలం వెనక్కి రాదు. ఇంటరాగేషన్‌లో పాటిస్తున్న వ్యూహాత్మకమైన మౌనాన్ని సింహం ఆ రోజున... అంటే... మీసం మెలేసిన కాలంలో కొంత వ్యూహాత్మక సంయమనాన్ని పాటించి ఉంటే నేటి రాజకీయ చదరంగం మరోలా ఉండేది కదా!...

# ఆక్వా ల్యాబ్ ప్రారంభం

ఆక్వా రైతులకోసం చిల్లకూరు మండలంలో ఏర్పాటుచేసిన ఆక్వా ల్యాబ్‌ను ఈనెల 17న ఆన్‌లైన్‌లో కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, ఎంపెడా ఛైర్మన్ శ్రీనివాసన్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు ప్రారంభించారు. చిల్లకూరు, కోట, గూడూరు ప్రాంతాల్లోని ఆక్వా రైతులు నీరు, మైక్రోబయాలజీ, పీసీఆర్ పరీక్షలను నామమాత్రపు రుసుంతోనే చేయించుకునేలా ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు జేడీ వివరించారు. నేషనల్ సెంటర్ ఫర్ సస్టైయినబుల్ ఆక్వా కల్చర్ (నాక్సా) సంస్థ ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. ఈ సంస్థ 10 నుంచి 20 మంది వరకు ఆక్వా రైతులను సొసైటీలుగా ఏర్పాటుచేసి సాంకేతిక సలహాలు ఇవ్వడం, ప్రోత్సహించడం చేస్తుందన్నారు. జిల్లాలోని 12 తీరప్రాంత మండలాల్లో 75సంఘాలు ఉన్నాయని, వీటిల్లో 1822 మంది రైతులు ఉన్నారని తెలిపారు. నాక్సా అధికారులు భారత్‌రాజు, సొసైటీ రైతులు పాల్గొన్నారు.

# స్నేహమేగా జీవితం..
# స్నేహమేగా శాశ్వతం..!



## మిత్రమా తులసీ...

స్నేహమేరా జీవితం... స్నేహమేరా శాశ్వతం
అన్న మాటలకు అక్షర సత్యం నీ స్నేహం..

మిత్రులంటే ప్రాణమిచ్చే మనస్తత్వం నీది
సేవాభావంతో గుబాళించే నాయకత్వం నీది...

నీతో గడిపిన ప్రతీ క్షణం మాకు చిరస్మరణీయం
నీవు నడచిన బాట మాకు ఆదర్శనీయం..

## నేస్తమా తులసీ...

నిన్నటి వరకు మాతో ఉన్న నువ్వు
ఇక లేవంటే తట్టుకోలేకున్నాం..
నిష్కల్మషమైన నీ నవ్వు
ఇక లేదంటే భరించలేకున్నాం...

## తులసీ...

నువ్వు ఏ లోకంలో వున్నా..
నువ్వే మా లోకం
నువ్వు మళ్ళీ పుట్టే వరకు...
ఆగదు మా శోకం.

సదా నీ జ్ఞాపకాలతో...
అశ్రునయనాలతో...

## గునపాటి తులసీరామ్‌రెడ్డి

| | | |
|---|---|---|
| రామ్‌ప్రసాద్‌రెడ్డి పెనాక<br>ఛైర్మెన్, అరబిందో ఫార్మ లిమిటెడ్ | అల్లం నారాయణ<br>ఛైర్మెన్, తెలంగాణ ప్రెస్ అకాడమీ | జి.శ్రీనివాసులనాయుడు (అల్లీపురం శీనయ్య)<br>డైరెక్టర్, బాలాజీ ఆగ్రో ప్రై.లి. |
| వి.వసంత్‌కుమార్‌రెడ్డి<br>అరబిందో రియాల్టీ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రై.లి. | ప్రశాంత్ మల్లాది<br>ఛైర్మెన్, మల్లాది డ్రగ్ & ఫార్మాస్యూటికల్స్ లి., చెన్నై. | మలిరెడ్డి శ్రీనివాసులరెడ్డి<br>సీనియర్ న్యాయవాది |
| వి.అజయ్‌కుమార్<br>డైరెక్టర్, ఐఎంఎఫ్ఎస్ | చిన్ని మధు<br>పార్టనర్, చిన్ని ఇంటర్నేషనల్ | ప్రభాకర్‌రావు దండే<br>విశాఖపట్నం |
| చిల్లకూరు శ్యామ్‌కుమార్‌రెడ్డి | కెవిఆర్ విజయశేఖర్‌రెడ్డి<br>కెవిఆర్ బ్రదర్స్ & ఫ్యామిలీ | పి.గోపినాధ్‌రెడ్డి |
| ఎ.శివకుమార్‌రెడ్డి | ఆర్.సి.మోహన్‌రెడ్డి | ఎన్.డోలేంద్రప్రసాద్ |

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com